ప్రజాశక్తి

ఆదివారం 24 ఆగస్టు 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



మార్కెట్ యార్డులో ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

ఎరువులు కోసం పడిగాపులు

ప్రజాశక్తి - మంగళగిరి

ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు పూర్తవుతుంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో వివిధ పంటలు సాగు చేసిన రైతులు వాటికి ఎరువులు వేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్స్ ఎరువుల కోసం రెండు మూడు రోజులు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. యూరియా అందుబాటులో లేదంటున్నారు. ఎరువులు కావాలంటే రెండు మూడ్రోజులు తిరగాల్సి వస్తోందని, ఒకరోజు వచ్చి పేరు నమోదు చేయించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. శనివారం మంగళగిరి పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో గల ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడ్డారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు తమ ఆధార్ కార్డులు చేతుల్లో పట్టుకుని పేర్లు నమోదు చేయించుకోవడానికి నానా అగచాట్లు పడ్డారు. కాంప్లెక్స్ ఎరువు ఏది వాడినా యూరియా కలపాల్సి వస్తుందని, యూరియా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఎరువుల కొరతేమీ లేదని మండల వ్యవసాయాధికారి శైలజారాణి చెబుతున్నారు. అన్ని పిఎసిఎస్ ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామని, ఇప్పటివరకు 1,28,200 బస్తాలు పంపిణీ చేశామని చెబుతున్నారు.

ఎరువు.. కరువు..

- సొసైటీలు, ఆర్ఎస్‌కెలకు అరకొర సరఫరా - ధరలు పెంచిన రిటైలర్లు
- ఫిర్యాదుల కోసం మానిటరింగ్ సెల్ - అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు : డిఎఒ



ప్రజాశక్తి-గుంటూరు

'కాకుమాను మండలం, రేటూరు గ్రామంలో సుమారు రెండువేల ఎకరాల్లో వరి పంట వేశారు.. ఎకరానికి కనీసం అరకట్ట యూరియా కావాలి.. ఈ విధంగా కనీసం వెయ్యి బస్తాలు అవసరం.. కానీ ఇటీవల 200 బస్తాలు వచ్చింది. సొసైటీ, రైతుసేవా కేంద్రాల్లో సంప్రదిస్తే స్టాక్ లేదు... ఇండెంట్ పెట్టాలి అంటున్నారు' ఇది ఒక గ్రామంలోని రైతుల పరిస్థితి. జిల్లాలోని అన్ని గ్రామాల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. సరిపడా ఎరువులు అందుబాటులో లేవు. ఉన్న కొద్దిపాటి నిల్వలు రైతులందరికీ దక్కట్లేదు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నీట మునిగిన పంటలను కాపాడుకోవటానికి ఎరువులకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. అయితే ఆస్థాయిలో సొసైటీలు, రైతుసేవ కేంద్రాల్లో రైతులకు అవసరమైన మేరకు సరఫరా లేదని చెబుతున్నారు. దీంతో రైతులు డీలర్ల వద్దకు వెళ్లి అధిక ధరకు కొనాల్సి వస్తుంది. మరోవైపు అధికారులు మాత్రం ఎరువుల కొరత లేదని ప్రకటిస్తున్నారు. గ్రామాల్లో అధికార పార్టీకి చెందినవారు సైతం ఎరువుల కోసం అధికారుల్ని నిలదీస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం అవుతోంది. అధికారుల ప్రకటనలకు గ్రామాల్లో పరిస్థితికి పొంతన ఉండట్లేదు. సాగుదారుల్లో 80 శాతంపైగా కౌలు రైతులే ఉండటంతో పంట వేయటానికి ఎన్ని వ్యయప్రయాలు పడుతున్నారో, ఆ పంటను కాపాడుకోవటానికి ఎరువుల కోసం ఇప్పుడు అంతకంటే ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలుగా ఉన్నప్పుడు సీజన్‌లో ఇదే సమయంలో మార్క్‌ఫెడ్ వద్ద కనీసం 25 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉండేవి. ఇప్పుడు 4 వేల మెట్రిక్ టన్నులకు మించి లేవని సమాచారం. పంట ప్రారంభ దశలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే ముందు ముందు సమస్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

యూరియా ఎటుపోతుంది?

ఖరీఫ్‌లో అన్ని రకాల ఎరువులు కలిపి 54,264 మెట్రిక్ టన్నులు అవసరం అని అధికారులు నిర్ణయించారు. అందులో యూరియా 24వేల మెట్రిక్ టన్నులు. కాగా ఇప్పటి దాకా యూరియా 11,380 మెట్రిక్ టన్నులు వచ్చింది. పాత నిల్వలతో కలిపి సుమారు 17 వేల మెట్రిక్ టన్నులు విక్రయించినట్లు చూపిస్తున్నారు. ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాలో యూరియా 6800 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రకటించారు. అయితే ఇంత పెద్ద ఎత్తున నిల్వలు ఉన్నట్లు ప్రకటిస్తున్నా ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో రిటైలర్ల వద్ద నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి. 18 మండలాల్లోనూ కలిపి యూరియా 1876 మెట్రిక్ టన్నులు, డిఎపి 1260 ఎంటిఎస్, కాంప్లెక్స్ 4207 ఎంటిఎస్ మాత్రమే అందుబాటులో ఉంది. ఆర్ఎస్‌కెలు, ప్యాక్స్‌కు సరిపడా సరఫరా కావడం లేదు. కంపెనీలకు సంబంధించి గోడౌన్ల

▶ 2లో

బిడ్డ కళ్లేదుటే నదిలో దూకిన తల్లి

ప్రజాశక్తి- తాడేపల్లి



ఒంటరిగా మిగిలిన బాలిక

పేగు బంధం పక్కనే ఉన్నా సుడులు తిరుగుతున్న నీళ్లలో తల్లి దూకగా.. కళ్లలో నీళ్లు సుడులు తిరిగేలా ఏడ్వడం మినహా ఏమీ చేయలేని దీన స్థితిలో బాలిక మిగిలింది. కన్న బిడ్డ ఎదుటే మహిళ నదిలో దూకిన ఘటన సీతానగరం పుష్కర ఘాట్ వద్ద శనివారం జరిగింది. ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా నదికి బిడ్డతో కలిసి శనివారం సాయంత్రం వచ్చిందో తల్లి. సీతాపురం పుష్కర్ ఘాట్ వద్ద ఇద్దరూ నిల్చుని ఉన్నారు. చిన్నారి బిడ్డ నీటి ప్రవాహాన్ని చూస్తుండగా ఆ పిల్ల ఎదుటే తల్లి నీళ్లలో దూకింది. ఏ జరుగుతుందో ఊహించనైనా లేని ఆ చిన్నారి బిగ్గరగా ఏడవడంతో చూట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు చిన్నారిని దగ్గరకు తీసుకున్నారు. నీటి ప్రవాహ ఉధృతి అధికంగా ఉండడంతో తల్లి ఆచూకీ అయినా కనిపించలేదు. తన పేరు అనేక్య అని, నదిలో దూకిన మహిళ తన తల్లి విజయ భార్గవి అని మాత్రమే బాలిక చెప్పగలుగుతోంది. మిగతా వివరాలేమీ చెప్పలేకపోతోంది. వివరాలు తెలిసిన వారుంటే సిఐ : 868883136, ఎస్ఐ : 8143873409, కానిస్టేబుల్ 9704352206 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని పోలీసులు కోరారు

ప్రముఖ షోరూం నిర్వాహకుడు పరారీ?

సుమారు రూ.20 కోట్ల అప్పులు- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణంలో ఓ ప్రముఖ షోరూం నిర్వాహకుడు భారీగా అప్పులు చేసి పరారీయ్యాడు. ఆ వ్యాపారికి మాచర్లలో పాటు ఇతర ప్రాంతాల్లో బ్రాంచీలున్నాయి. పట్టణంలోని షోరూం గత 10 రోజుల క్రితం మూసివేయటంతో అనుమానం వచ్చిన అప్పులిచ్చినవారు విచారణ చేయగా ఆ వ్యాపారి పరారైనట్లు తెలిసి లబోదిబోమంటున్నారు. ఫోన్లు చేసినా సమాదానం ఇవ్వటం లేదని వాపోతున్నారు. ఇతర దేశాలకు పారిపోయినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మాచర్ల పట్టణం, చుట్టు పక్కల గ్రామాల వారి నుండి సుమారు రూ.20 కోట్లు అప్పులు చేసినట్లు సమాచారం. ఇతర బ్రాంచీల పట్టణాల్లో కూడా భారీగా అప్పులు చేసినట్లుగా తెలిసింది. దీనిపై బాధితులు పల్నాడు జిల్లా ఎస్పీని కలవనున్నట్లు తెలిసింది. మాచర్లలో త్వరలో మరో ఇద్దరు వ్యాపారులు ఐపీలు పెట్టే అవకాశం వుందని పుకార్లు వస్తున్నాయి. అధిక లాభాలు వస్తాయని కొందరు అప్పులు చేసీ అమరావతి ప్రాంతంలో స్థలాలపై పెట్టుబడులు పెట్టి నష్టపోయినట్లు తెలిసింది. ఇటీవల కాలంలో రూ.కోట్లలో అప్పులు చేసి పరారవుతున్న ఘటనలు తరుచూ జరగుతుండటం పట్ల వ్యాపారులు, వడ్డీలకు ఇచ్చే వారు అదిరిపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వ్యాపార రొటేషన్ కోసం నగదు ఇచ్చే వారు కూడా ఇవ్వటం లేదని, ఈ పరిస్థితులే కొనసాగితే వ్యాపారాలు కుంటుపడి మరికొందరు దివాలా తీస్తారని ఇతర వ్యాపారులు చెబుతున్నారు.



పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తాం

పిఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి - అధికారులతో కేంద్రమంత్రి చంద్రశేఖర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించి పర్యాటకులకు తగిన వసతులను కల్పిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జిల్లాలో పిఎంజెవికె, సూర్యఘర్ పథకాల అమలు, టూరిజం అభివృద్ధిపై కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ మినీ సమావేశ మందిరంలో మంత్రి శనివారం సమీక్షించారు. ఎన్‌టిఆర్ మానస సరోవరం, పేరేచర్ల నందనవనం, ఉండవల్లి గుహలు, ఉప్పలపాడు విదేశీ పక్షుల కేంద్రం అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. సూర్యఘర్ పథకం కింద గుంటూరు పార్లమెంటు పరిధిలో లక్ష 16 వేలమంది నమోదయ్యారని, వీరిలో 3600 మందికే పరికరాలు అమర్చారని చెప్పారు. బ్యాంకు లోన్లు, పోర్టల్‌లో ఉన్న ఇబ్బందులు, అధికారులు

▶ 2లో



బార్‌ల నిబంధనలు సరళతరం

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మద్యం విక్రయా లకు బార్ల లైసెన్సుల మంజూరుకు దరఖాస్తు లకు ఈనెల 26న చివరి తేదీగా నిర్ణయించినట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని తెలిపారు. ఒక్కో దరఖాస్తుకు రూ.5లక్షలు ఫీజులు నిర్ధారించామని, రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. అయితే గతంలో నాలుగు దరఖాస్తులు రాకపోతే లాటరీ తీయబోమని చెబుతూఐ దరఖాస్తు దారులకు ఫీజు తిరిగి ఇవ్వబోమని ప్రభుత్వం ప్రకటించిందని అయితే తాజాగా లాటరీ తీయని బార్లకు సంబంధించిన దరఖాస్తుదారులకు ఫీజు రిఫండ్ ఇస్తామన్నారు. మూడేళ్ల పాటు కొనసాగే లైసెన్సులకు కూడా ఫీజులు ఆరు వాయిదాల్లో చెల్లింవచ్చునన్నారు. గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్‌ల పరిధిలో 10 కిలో మీటర్ల విస్తీర్ణంలో ఇతర మునిపాలిటీ పరిధిలో మూడు కిలో మీటర్ల పరిధిలో నిర్దేశిత ఫీజులు చెల్లించాలన్నారు. గతంలో ఉన్న వ్యాపారులతో పాటు కొత్త వ్యాపారులు కూడా బార్ల ఏర్పాటుకు దృష్టి కేంద్రీ కరిస్తున్నారని ఆయన తెలిపారు. బార్ల సమయం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఉంటుందన్నారు. గత ంలో కన్నా పలు నిబంధనలు సడలించామన్నారు. అందు వల్ల గతంలో ఉన్న వారితో పాటు కొత్త వారు కూడా దరఖాస్తు చేయ డానికి ముందుకు వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

చవితి ఉత్సవాల్లో నిబంధనలు తప్పని సరి

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు : ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వినాయక చవితి పండుగ సందర్భంగా పందిళ్ళు ఏర్పాటు మరియు ఊరేగింపు కార్యక్రమాల నిర్వాహకులకు నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. వినాయక "విగ్రహ ప్రతిష్ఠ పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్ లలో తెలిపి, వారి గుర్తింపు కార్డు నకలు కాపీలు పోలీస్ వారికి చూపించి అనుమతి పొందాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేట్ లేదా పంచాయతీ, మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మున్సిపల్, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి పందిళ్ళు మండపాలు ఏర్పాటు చేసి, అగ్నిమాపక చర్యల్లో బాగంగా వాటి వద్ద ఇసుక మరియు నీళ్ళను ఏర్పాటు చేసుకుని తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాలలో దీపారాధనల వలన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు జాగ్రత్త వహించాలన్నారు. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం మరియు విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలన్నారు. లౌడ్ స్పీకర్లను రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ఎట్టి పరిస్థితులలోను ఉపయోగించరాదన్నారు. భద్రత కొరకు రాత్రి సమయాల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతినిధులు కాపలా ఉండాలని, మండపాల్లో డబ్బులు, బంగారం లాంటి విలువైన వస్తువులు ఉంచరాదన్నారు. డిజె సౌండ్స్ వినియోగించరాదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఇతర కులాలు, ఇతర మతాలకు,ఇతర రాజకీయ పార్టీల వారికి వ్యతిరేకంగా నినాదాలు చేయరాదు. వారి మనోభావాలను తెబ్బతీసే విధంగా ప్రవర్తించరాదన్నారు.

పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారుల మధ్య సమన్వయ లోపాలు తదితర అంశాల వల్ల ఆలస్యం జరుగుతోందన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనార్టీల అభ్యున్నతికి దోహదపడే పిఎంజెవికె పథకాన్ని ఉపయోగించుకోవాలనుకుంటే 25 శాతం మంది మైనారిటీలున్న ప్రాంతాల్లోనే సాధ్యమవుతుందని, గుంటూరు తూర్పు ప్రాంతంలో పలు ప్రాంతాలు ఈ పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు. గుంటూరులో ఎడెకరాల్లో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు, జిజిహెచ్ విస్తరణ కోసం బొంగరాల బీడు హాస్పిటల్ నిర్మాణం, ఆటో నగర్ కార్మికుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, అంజుమన్ ల్యాండ్‌లో మల్టీ పర్పస్ స్కిల్ సెంటర్ ప్రధాన ప్రాజెక్టులకు ప్రతిపాదించినట్టు తెలిపారు. ఆటోనగర్‌లో ఒక ఎకరంలో ఆటో నగర్ కార్మికులకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు, అంజుమన్ మల్టీ పర్పస్ స్కిల్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ పథకాలకు సంబంధించి డీపీఆర్ (సమగ్ర నివేదికలు) దశల వారీగా సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, డిఆర్‌ఓ ఎన్ఎస్‌కె.ఖాజావలి, సిపిఒ శేషశ్రీ, పర్యాటక శాఖాధికారి శ్రీరమ్య, అటవీ శాఖాధికారి హిమశైలజ, ఎల్‌డిఎం మహిపాల్‌రెడ్డి, విద్యుత్, మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఎరువు..కరువు..

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరులో ఉండటంతో గుంటూరు జిల్లాకు కేటాయించినట్లు చూపినా ఇక్కడి నుండి వివిధ జిల్లాలకు కూడా ఆయా కంపెనీల ద్వారా సరఫరా అవుతున్నట్లు సమాచారం.

ధరల మోత..

యూరియా కొరత వల్ల డీలర్లు ధరలు పెంచేశారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవటంతో రైతులు డీలర్ల వద్దకు వెళ తున్నారు. దీంతో వారు ధరలు అమాంతం పెంచేశారు. యూరియా బస్తా రూ.266కు విక్రయించాల్సి ఉండగా రూ.350కుపైగా అమ్ముతున్నారు. డిఎపి బస్తా రూ.1350 కాగా, రూ.1550 తీసుకుంటున్నారు. ఎరువులతోపాటు పురుగుమందులు కూడా అంటగడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్‌కెలు, సొసైటీలతో నిల్వలు మరింత పెంచాలని, రైతులకు సరిపడా, నిర్దేశించిన ధరలకు ఎరువులు అందించాలని కోరుతున్నారు. ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవట్లేదనే విమర్శలు వస్తున్నాయి.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

జిల్లాలో ఆగస్టు నెలకు 6800 మెట్రిక్ టన్నుల యూరియా, 2454 మెట్రిక్ టన్నుల డిఎపి అందుబాటులో ఉంది. సెప్టెంబర్‌కు కావాల్సిన ఎరువులు ఆ మాసంలో జిల్లాకు వస్తాయి. యూరియాను అక్రమంగా నిల్వ ఉంచిన, అధికంగా నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలి. డీలర్లు జిల్లా రైతులకే నిర్దేశించిన ధరకే విక్రయించాలి. అధిక ధరకు విక్రయిస్తే వ్యవసాయాధికారిగా ఫిర్యాదు చేయొచ్చు. అటువంటి డీటర్లపై చర్యలు తీసుకుంటాము. యూరియా అమ్మకాలపై నిరంతర నిఘా కోసం తహశీల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్, వ్యవసాయాధికారితో మండల స్థాయి నిఘా బృందం ఏర్పాటు చేశాం. యూరియా అక్రమ రవాణా, లభ్యత, అమ్మకంపై ఎలాంటి ఫిర్యాదులున్నా డిఎఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్‌కు (8331056906) ఫిర్యాదు చేయొచ్చు.

సిపిఐ నేత సురవరం మృతికి నివాళి

ప్రజాశక్తి - తెనాలి : సిపిఐ అగ్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి మృతికి ఆ పార్టీ రాష్ట్ర సమితి నాయకులు చెరుకుమల్లి సింగారావు శనివారం సంతాపం వ్యక్తం చేశారు. వామపక్షాల ఐక్యతకు కృషిచేసిన సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరి పట్టణంలో శనివారం సిపిఐ అగ్రనేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి మంగళగిరి సీపీఐ పార్టీ కార్యాలయంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ



కార్యదర్శి చిన్నితిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్యలు మాట్లాడుతూ "సురవరం సుధాకర్ రెడ్డి తన జీవితాన్ని సామాజిక న్యాయం, కార్మికుల హక్కులు, రైతుల సంక్షేమం కోసం అంకితం చేశారన్నారు. జాతీయ రాజకీయాల్లోనూ, రాష్ట్ర రాజకీయాల్లోనూ ఆయన చూపిన త్యాగపథం మార్గదర్శకమని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు నివాళులర్పించారు.

ప్రజాశక్తి- తాడేపల్లి: సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటేరియన్ సురవరం సుధాకరరెడ్డి మరణం వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు, పేదలకు తీరని లోటని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శులు తుడిమెల్ల వెంకటయ్య,ముసునూరు సుహాస్ అన్నారు. శనివారం తాడేపల్లి సిపిఐ పార్టీ కార్యాలయంపై అలాగే పలు ప్రాంతాలలో ఉన్న సిపిఐ పార్టీ స్థూపాల వద్ద జండాలను అవతానం చేసి సురవరం సుధాకర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

డీజేలు పెట్టి అధిక సౌండ్‌లు పెడితే కఠిన చర్యలు

చవితి వేడుకలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిడమర్రులో అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

వినాయక చవితి పర్వదినం సందర్భంగా డీజేలు ఏర్పాటు చేసేందుకు అనుమతి లేదని మంగళగిరి గ్రామీణ పోలీసులు తెలిపారు. వినాయక చవితి నిర్వహణకు సంబంధించి ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా శనివారం మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన పందిళ్ళ వద్ద ఆలయాల్లో పూజా కార్యక్రమాలను సకాలంలో ఏర్పాటు చేసుకొని త్వరగా ముగించుకోవాలని ఆయన తెలిపారు. లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించవద్దని అన్నారు. వినాయక చవితి పర్వదినం తరువాత జరిగే నిమజ్జన కార్యక్రమంలో పోలీసుల నిబంధనలను పాటించాలని తెలిపారు. బాణాసంచా పేల్చేందుకు అనుమతి లేదని పేర్కొన్నారు. మద్యం సేవించి అల్లర్లకు దిగిన ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించిన ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ప్రజలు తమ పరిధిలో ఏమైనా అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకుంటే తమకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, గ్రామంలో శాంతిభద్రతలు కాపాడడం అందరికీ బాధ్యత అని పేర్కొన్నారు. పోలీసులు సూచించిన నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సాగర్‌కు వరద ప్రవాహం

26 గేట్ల ద్వారా నీటివిడుదల - జలాశయానికి 4,13,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో - 584.60 అడుగుల వద్ద నీటిమట్టం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతుంది. శనివారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం నుండి 4,13,445 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తుండగా సాగర్ 26 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,61,322 క్యూసెక్కులను నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 584.60 అడుగులవద్ద ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 296.2810 టీఎంసీల నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 32,886 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 9019 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7518 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులు, లోలెవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తంగా 4,13,445 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



ఎస్‌పిని సన్మానిస్తున్న హతురాలి కుటుంబ సభ్యులు

పోలీసు అధికారులకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెంలో గతేడాది జులై 15న జరిగిన మైనర్ బాలిక కిడ్నాప్, హత్య కేసులో ఏడాది దాటక ముందే నిందితుడికి జీవిత ఖైదు శిక్షపడేలా చేయ డంలో పోలీసుల కృషి ఎంతో ఉందని బాలిక కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎస్‌పి సతీష్ కుమార్, తెనాలి డిఎస్‌పి జనార్ధనరావును గుంటూరులోని ఎస్‌పి కార్యాలయంలో కలిసి శాలువా కప్పి సన్మానించారు. బాధితులకు సత్వర న్యాయం చేయుటకు అహర్నిశలు కషి చేస్తున్న ఎస్‌పికి కృతజ్ఞతలు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఘటన జరిగిన నిందితుడు అరెస్టు అయిన 8 నెలల కాలంలో విచారణ పూర్తి చేయించి శిక్ష విధించడం చాలా అరుదు అని బాలిక తండ్రి దావీదు, కుటుంబ సభ్యులు తెలిపారు. తమ బిడ్డ హత్య కేసులో ఇంత త్వరగా తమకు న్యాయం జరుగుతుందని కలలో కూడా ఊహించలేదని, ఎస్‌పి ఆధ్వర్యంలో తెనాలి డిఎస్‌పి చేసిన దర్యాప్తు చురుగ్గా సాగిందన్నారు.

ఎన్.వి.నరసింహారావును ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా పూర్వ గౌరవాధ్యక్షులు ఎన్.వి.నరసింహారావు ప్రథమ వర్ధంతి సభ కలెక్టరేట్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నరసింహారావుకు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్. వెంకటేశ్వర్లు, సీనియర్ సభ్యులు వెంకట్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు, జిల్లా కోశాధికారి లూర్దు రెడ్డి, పల్నాడు జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్.సుధాకర్‌బాబు తదితరులు ప్రసంగించారు. సంఘం అభివృద్ధిలో నరసింహారావు కృషి చేశారన్నారు. గుంటూరు జిల్లా రేపూడి గ్రామంలో పుట్టి చిన్నతనం నుండి బాలమిత్ర సంఘం నుండి మొదలై ఎన్‌జిఒ సంఘం, జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షునిగా, ఉద్యోగక్రాంతి అధ్యక్షునిగా, తదితర ప్రజాసంఘాల్లో పనిచేసి, సమస్యల పరిష్కానికి కృషి చేశారన్నారు. జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన నరసింహారావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆస్తి హక్కు కల్పించింది టిడిపినే

ప్రజాశక్తి – తాడికొండ

భారతదేశంలో మహిళలకు మొదటిసారిగా ఆస్తి హక్కు కల్పించింది టిడిపి అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం తాడికొండలోని సినిమా హాలు వద్ద ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి విజయోత్సవం సందర్భంగా అయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేసి మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నది కూటమి ప్రభుత్వమని ఆయన అన్నారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా మహిళల ఆర్థికంగా నిలబడే విధంగా చర్యలు తీసుకుంది టిడిపి ప్రభుత్వం అన్నారు.మహిళలు రాజకీయాల్లో కూడా రాణిస్తారని ఆదిశగా వారిని ప్రోత్సహించడం జరిగిందన్నారు. స్త్రీ శక్తి ఫ్రీ బస్సు రెండు వేల కోట్ల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. 16 వేల డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేస్తోందన్నారు. లామ్ గ్రామం నుండి తాడికొండ వరకు బస్సులో ప్రయాణించి మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పెద్దలు ఎడ్డూరి వీర హనుమంతరావు తాడికొండ గ్రామంలో నీటి కష్టాలు అధికంగా ఉన్నాయనీ, కృష్ణనది దగ్గరలో ఉన్న తాడికొండ అవసరాలు తీర్చడం కష్టం తరం అవుతుందని ఆయన ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు.

సైబర్ నేరగాళ్ల మాయాజాలం

ప్రజాశక్తి – దుగ్గిరాల

మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన నిరంజన్ రెడ్డి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి రూ.లక్ష 36 వేలు నష్టపోయిన సంఘటన శనివారం చోటు చేసుకున్నది. సేకరించిన వివరాల ప్రకారం అతనికి పోలీస్‌శాఖ వారి నుండి ద్విచక్ర వాహనంపై జరిమానా విధించినట్లు చరవాణి ద్వారా నోటీసు వచ్చింది. వచ్చిన నోటీసు వివరాలు తెలుసు కునేందుకు యాప్‌క్లిక్ చేయగా ఓటిపి వచ్చినది ఓటీపీ చెప్పక పోయినప్పటికీ యాప్‌క్లిక్ చేసినప్పుడే ఆతని ఎకౌంటును హ్యాక్ చేసి మూడుసార్లు డ్రా చేసినట్లు తెలిసింది. అనంతరం పరిశీలించగా ఆన్లైన్ ద్వారా ఐదు చరవాణిలు కొనుగోలు తెలిసింది. ఆన్లైన్ ద్వారానే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

కిశోర వికాసం కార్యక్రమం

ప్రజాశక్తి – మేడికొండూరు

మండలంలోని సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు కిశోర వికాసం కార్యక్రమం జరిగింది. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫోక్స్‌లో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహ నిషేధ చట్టం, పలు రకాల నైపుణ్య అభివద్ధి అంశాలపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రైల్వే చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్‌లైన్ విభాగ అధికారులు లక్ష్మణ్, సావిత్రి, కళాశాల ప్రిన్సిపల్ మధుకృష్ణ, కళాశాల లెక్చరర్లు శాంతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ డి సునీత, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి– తాడేపల్లి

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి నులకపేటలో జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లి మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరావు, జొన్న రాజేష్, భీమిశెట్టి రాజు అండ్ ఫ్రెండ్‌సర్కిల్, ఏమనిశివ నాగేంద్రం, శ్రీను, భవనారాయణ, శేషగిరి , దినేష్, మళ్లీ, నాని, జీలగ కళ్యాణ్, వెంకీ పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్త హత్య

బొల్లాపల్లి అడవిలో దారుణం - ఘటనా స్థలిని పరిశీలించిన డీఎస్పీ బానోదయ

ప్రజాశక్తి – వినుకొండ

వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను దారుణంగా హత్య చేయించిన సంఘటన బొల్లాపల్లి మండలం నెహ్రూ నగర్ తండా వద్ద జరిగింది. గుంటూరు గోరంట్ల మేరీ ప్రియనగర్కు చెందిన మున్నంగి ప్రదీప్ కుమార్ (43) బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు నుండి నెహ్రూ నగర్ తండాకు వెళ్ళు అటవీ ప్రాంతంలో హత్యకు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న గుంటూరు సౌత్ డిఎస్పి జి. భానోదయ నల్లపాడు ఎస్ఐ రామ కృష్ణ సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మున్నంగి ప్రదీప్ కుమార్, భార్య మరియమ్మ రోజువారి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇరువురు సంతానం కలరు. ప్రదీప్‌కుమార్ ఈనెల 20వ తేదీ కనపడక పోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. అయితే బొల్లాపల్లి ఫారెస్ట్‌లో మృతదేహం కనిపించడంతో ప్రదీప్ కుమార్ గా గుర్తించారు. భార్య మరియమ్మకు అదే కాలానికి చెందిన ఎం.సాంబశివరావుతో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. భర్త అడ్డొస్తున్నాడని ప్రియుడుతో హత్య చేయించినట్లు విచారణలో తేలిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హంత కుడు సాంబశివరావు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వరి, ఉద్యాన పంటలు సాగు

ప్రజాశక్తి – చేబ్రోలు

మండలంలో వరి,ఉద్యానవన పంటలు దాదాపు 6000 హెక్టార్లలో సాగు చేసినట్లు వ్యవ సాయాధికారి పి. ప్రియదర్శిని తెలిపారు. ఆమె మాట్లాడుతూ పంట కాలానికి యూరియా 1400 ఎంటి, డిఎపి 800ఎంటి వరకు వాడకం జరిగిందన్నారు. ఇప్పటివరకు జిడిసిఎంఎస్ చేబ్రోలు, నారాకోడూర్ రైతు సేవ కేంద్రాలు, ప్రైవేటు డీలర్స్ ద్వారా మొదటి దఫాగా దాదాపు 800 ఎంటి యూరియా, 300 ఎంటి డిఎపి సరఫరా చేసినట్లు తెలిపారు. రైతులు ఇప్పటి వరకు అవసరమైన ఎరువులు మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. ఎక్కడైనా ఎరువులు నిల్వలు ఉన్నట్లు కనుగొంటే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి– తాడేపల్లి

జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంగదారి సుబ్బరత్నమ్మ శనివారం తాడేపల్లి పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు రికార్డులు పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యత్వాన్ని పెంచి విద్యార్థులు గ్రంథాలయానికి తరచూ వచ్చేలా కృషి చేయాలన్నారు. తాడేపల్లి గ్రంథాలయాధికారి ఎస్కే నాగూర్‌భాష పాల్గొన్నారు.

మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

MVOP No.638/2023

బిట్వీన్:

రాచమళ్ళ హర్షిని,మైనరు అయినందున గార్డియన్ తండ్రి. రాచమళ్ళ రామ చంద్ర రావు. ...పిటీషనరు

మరియు

చెన్నబోయిన శ్రీనివాస రావు వగైరాలు....రెస్పాండెంట్లు

టు,

2వ రెస్పాండెంటు:

చెన్నబోయిన నగేష్, తండ్రి.శ్రీనివాస రావు, నివాసం డోర్ నెం.25-17-343-17,60 అడుగుల రోడ్డు, శ్రీనివాస రావు పేట, గుంటూరు (సిటీ & జిల్లా). (హొండా సైన్ మోటార్ సైకిల్ చోదకుడు నెం. AP 39 FP 1398)

పై నెంబర్ పిటీషనులోని పిటీషనరుకు యాక్సిడెంటులో తగిలిన దెబ్బలుకు నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటిషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం ది.25-09-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:25-09-2025

చంద్రగిరి బాబురావు,
పిటీషనరు తరపు అడ్వకేట్, గుంటూరు.

NOTICE
IN THE COURT OF THE V ADDL.DIST.JUDGE:: GUNTUR
M.V.O.P.No.499/2022

Between:

Bapati Sivamma & Others.... Petitioners

And

Shaik Khaja& Others.... Respondents

To,

R-4: Subhas Parasuram Dhanawade, S/o.Not know, R/o. Flat No.203, Neel Shree CHS, Plat No.18, Scetor-08, Kalamboli, Raigarh, Maharashtra and State, 410218. (Owner of Tipper Lorry bearing No. MH 06 AQ 8924)

R-5: V. Vishnu Murthy,S/o. Sambasiva Rao,R/o. Madduru, Mangalagiri Post and Mandal, Guntur Dist.,(Driver of Tipper Lorry bearing No. MH 06 AQ:8924)

పై నెంబరు ఒ.పి.లోని పిటీషనర్లు యాక్సిడెంటులో బాపతి కేసి రెడ్డి మరణించినందున నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటిషనులో 4&5 వ రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీకోర్టువారు ది.02-09-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది.02-09-2025

తోట శ్రీనివాసరావు,
పిటీషనర్లు తరపు న్యాయవాది, గుంటూరు.

దావా సమన్లు

మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఐ.ఏ. నెం. 266/2021 ఇన్ ఓ.యస్. నెం. 934 / 2021

బిట్వీన్:

కాంశెట్టి శ్రీనివాస రావు. ...పిటీషనర్/వాది

మరియు

కుంటిగోర్ల విక్టోరియమ్మ వగైరాలు ...రెస్పాండెంట్స్/ప్రతి వాదులు

టు,

1వ ప్రతివాది/1వ రెస్పాండెంటు: కుంటిగోర్ల విక్టోరియమ్మ, భర్త. బొల్లయ్య@బుల్లయ్య,

2వ ప్రతివాది/2వ రెస్పాండెంటు: కుంటిగోర్ల వెంకటేష్, తండ్రి. బొల్లయ్య@ బుల్లయ్య,

3వ ప్రతివాది/3వ రెస్పాండెంటు: కుంటిగోర్ల శ్రీనివాస్,తండ్రి. బొల్లయ్య@బుల్లయ్య, అందరి నివాసం: డోకిపర్రు గ్రామం, మేడికొండూరు మండలం, గుంటూరు జిల్లా.

5వ ప్రతివాది/5వ రెస్పాండెంటు:నల్లగోర్ల వాణి,భర్త.నాగయ్య, తండ్రి. కుంటిగోర్ల బొల్లయ్య@బుల్లయ్య, నివాసం డోర్ నెం. 5-298, ద్వారకనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావా 934/2021లో ప్రతివాదులు మరియు సదరు దావా లోని ఐ.ఎ.నెం.266/2021 పిటీషనులో రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్లు/నోటీసులు పంపించినను ముట్టన oదున మీకు సమన్లు/నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు **ది.08-09-2025**కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పైకోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును. **వాయిదా తేది:08-09-2025**

దివ్వి శ్రీనివాస రావు, M.అపర్ణ, వాది తరపు అడ్వకేట్స్,
నగరంపాలెం, గుంటూరు, సెల్ : 8977777377

IN THE COURT OF THE JUDICIAL FIRST CLASS MAGISTRATE CUM II ADDL. JUNIOR CIVIL JUDGE:: TENALI
O.S.NO.251/2024
Hearing Date:-11.09.2025

BETWEEN:

Plaintiff :- Bank of Baroda, Angalakuduru Main Road, Tenali Mandal, Guntur District, Rep. By Its Senior Manager

AND

Defendants :- The 1st Defendant is Ravela Kalpana, W/o Arun Babu, R/o D.No.21-3-24, Railpet, Tenali, Guntur District-522201, Cell No. 9490643258 and another

సదరు పత్రిక ప్రకటన మూలముగా తెలియపరచునది సదరు పైన ఉదహరించిన ప్రతివాదికి ఎన్ని పర్యాయములు, సదరు పైన ఉదహరించిన చిరునామాలకు దావా సమనులు శ్రీ కోర్టు వారి ద్వారా పంపించినను, మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించినను అమలు కాకపోవుట మూలముగా శ్రీకోర్టువారు సమనులు అమలు నిమిత్తము Substituted service క్రింద ఉత్తర్వులు మంజూరు చేసియున్నారు గాన ఈ పత్రిక ప్రకటన ఇవ్వడమైనది ఈ ప్రకటన చూసి శ్రీకోర్టువారి యెదుట ది.11.09.2025 వ తేదీన హాజరు కావలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

From: IN THE COURT OF THE JUDICIAL FIRST CLASS MAGISTRATE CUM II ADDL JUNIOR CIVIL JUDGE:: TENALI

To,

1) రావెల కల్పన W/o. అరుణ్‌బాబు, డోర్ నెంబర్ 21-3-24, రైల్‌పేట, తెనాలి.

IN THE COURT OF THE JUDICIAL FIRST CLASS MAGISTRATE CUM II ADDL. JUNIOR CIVIL JUDGE:: TENALI
O.S.NO.250/2024
Hearing Date:-11.09.2025

BETWEEN:

Plaintiff :- Bank of Baroda, Angalakuduru Main Road, Tenali Mandal, Guntur District, Rep. By Its Senior Manager

AND

Defendants :- The 1st Defendant is Venigalla Mahesh S/o. Srinivasa rao, R/o.D.No.8-384/1,Hindu, aged about 38,Yedlapativari street, Srinagar Colony, Angalakuduru Village, Tenali Mandal, Guntur District, Mobile No. 9959828284 and another

సదరు పత్రిక ప్రకటన మూలముగా తెలియపరచునది సదరు పైన ఉదహరించిన ప్రతివాదికి ఎన్ని పర్యాయములు, సదరు పైన ఉదహరించిన చిరునామాలకు దావా సమనులు శ్రీ కోర్టు వారి ద్వారా పంపించినను, మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించినను అమలు కాకపోవుట మూలముగా శ్రీకోర్టువారు సమనులు అమలు నిమిత్తము Substituted service క్రింద ఉత్తర్వులు మంజూరు చేసియున్నారు గాన ఈ పత్రిక ప్రకటన ఇవ్వడమైనది ఈ ప్రకటన చూసి శ్రీకోర్టువారి యెదుట ది.11.09.2025 వ తేదీన హాజరు కావలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

From: IN THE COURT OF THE JUDICIAL FIRST CLASS MAGISTRATE CUM II ADDL JUNIOR CIVIL JUDGE:: TENALI

To,

1) వెనిగళ్ళ మహేష్, S/o. శ్రీనివాసరావు, డోర్ నెంబర్ 8-834/1, ఎడ్లపాటి వారి వీధి, శ్రీనగర్ కాలనీ, అంగలకుదురు, తెనాలి మండలం, గుంటూరు జిల్లా.

LOSS OF PASSPORT

I,**KOYA VENKATA RAVI CHANDRA S/o VENKATESWARLU** R/D No;13-4-69/87, Srinivasa Nagar, Near T.V Tower, Vinukonda Road, Narasaraopet, Palnadu Dt, A.P-522601. have lost my **Passport vide bearing No. N0643092,** (Valid up to 1-07-2025)while I was shifting my house in the same street on 18-08-2025. If anybody found please **Contact: 9381495350.**

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE AT VIJAYAWADA
M.V.O.P.NO.311/2024

Between

Veeranki Bhavani and another ... Petitioners

And

Surabhi Pandu Ranga Rao and 2 others ...Respondents

TO

RESPONDENT NO.1

1.Surabhi Pandu Ranga Rao, S/o.Venkateswara Rao, aged about 47 years, Driver, D.No.5-50-85, 5/13, Brodipet, Guntur Town, A.P.

RESPONDENT NO.2

2.Surabhi Veeramma, W/o.Pandu Ranga Rao, aged about 45 years, Owner, D.No.5-50-85, 5/13, Brodipet, Guntur Town, A.P.

Whereas the Petitioners are filed the above MVOP, seeking compensation under M.V. Act. The matter is posted to 10.09.2025 for the appearance of the Respondent No.1 and 2. Hence, please take notice and attend before the Hon'ble Court on 10.09.2025 at 10.30 a.m. either in person or with your counsel, failing which the matter will be decided exparte.

(By order of the Hon'ble Court)

Vijayawada
Dt.21.08.2025

D.RADHA KRISHNA REDDY
Advocate
D.No.7-684/1, Ramapriya Nagar
Kanuru, Vijayawada-520007
Cell No.9848157545

यूनियन बैंक ऑफ इंडिया – यూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/ తనఖాదారులు / కో ఆబ్లిగెంట్స్:

1. మెస్సర్స్ గాయత్రి కాటన్ ట్రేడర్స్, హెచ్ నెం. 7-33, పెద్ద బజార్, ఎడ్లపాడు-522233. **2. శ్రీ కల్లూరి పవన్ కుమార్ (మేనేజింగ్ పార్టనర్),** హెచ్ నెం. 7-33, పెద్ద బజార్, ఎడ్లపాడు-522233. **3. శ్రీ కల్లూరి పవన్ కుమార్ (మేనేజింగ్ పార్టనర్),** ఫ్లాట్ నెం. 503, 4వ అంతస్తు, సన్నిధి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, డి.నెం. 68/1, కోరెటెపాడు, జెకెసి కాలేజ్ రోడ్డు, 7వ లైన్, విజయపురి కాలనీ, జిఎస్ఆర్ టవర్స్ ఎదురుగా, ఎన్ఆర్ఐ ఉమెన్స్ కాలేజ్, గుంటూరు. **4. శ్రీమతి కల్లూరి నాగరాణి (పార్టనర్),** భర్త: శ్రీ కల్లూరి పవన్ కుమార్, హెచ్ నెం. 7-33, పెద్ద బజార్, ఎడ్లపాడు-522233. **5. శ్రీమతి కల్లూరి నాగరాణి (పార్టనర్),** భర్త: శ్రీ కల్లూరి పవన్ కుమార్, ఫ్లాట్ నెం. 503, 4వ అంతస్తు, సన్నిధి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, డోర్ నం. 68/1, కోరెటెపాడు, జెకెసి కాలేజ్ రోడ్డు, 7వ లైన్, విజయపురి కాలనీ, జిఎస్ఆర్ టవర్స్ ఎదురుగా, ఎన్ఆర్ఐ ఉమెన్స్ కాలేజ్, గుంటూరు.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ కల్లూరి పవన్ కుమార్ & కల్లూరి నాగరాణి కి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.09.08.2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 11.03.2022** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీ చేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తేలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఈ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఈ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 09.08.2021** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటి వరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూల్‌లో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:

ఆస్తి నెం. 1: పల్నాడు జిల్లా, ఎడ్లపాడు మండలం, ఎడ్లపాడు గ్రామం, డి.నెం. 362/ఏ, డి.నెం. 6-40/2లో విస్తీర్ణం 68.14 చ.గ.ల నివాస స్థలం మరియు గ్రౌండ్ ఫ్లోర్ & మొదటి అంతస్తు గల భవనం శ్రీ కల్లూరి పవన్ కుమార్ గారికి చెందినది. హద్దులు: **తూర్పు:** బజార్ 24'8", **దక్షిణం:** ఎలిశెట్టి అంజమ్మ గారికి చెందిన ఆస్తి 24'10", **పడమర:** మారెళ్ల ఆదిలక్ష్మి గారికి చెందిన స్థలం 24'00", **ఉత్తరం:** గల్లీ బజార్ 25'6"

ఆస్తి నెం. 2: గుంటూరు, జెకెసి కాలేజ్ రోడ్డు, విజయపురి కాలనీ 7వ లైన్, డి.నెం. 68/1, సన్నిధి రెసిడెన్సీ, నాల్గవ అంతస్తులో గల 818.08 చదరపు గజాల విస్తీర్ణంతో పాటు, 40.9 చదరపు గజాల అవిభక్త మరియు అనిశ్చితపు విస్తీర్ణం గల నివాస ఫ్లాట్ నెం. 503 శ్రీమతి కల్లూరి నాగరాణి, భర్త: శ్రీ కల్లూరి పవన్ కుమార్ గారి పేరున కలదు. **హద్దులు: తూర్పు:** ఓ. బాపిరెడ్డి & ఇతరులకు చెందిన ఆస్తి 115", **దక్షిణం:** బజార్ 70'5", **పడమర:** ఈ ఆస్తికి మరియు కారంపూడి సుబ్బారావు గారి ఆస్తికి మధ్య ఉన్న 15' వెడల్పు దారి 113'5", **ఉత్తరం:** కారంపూడి సుబ్బారావు గారి ఆస్తి 70'5". **ఫ్లాట్ హద్దులు: తూర్పు:** కామన్ కారిడార్, **దక్షిణం:** ఖాళీ స్థలం, **పడమర:** ఖాళీ స్థలం, **ఉత్తరం:** ఈ ఫ్లాట్‌కి మరియు ఫ్లాట్ నెం. 504కి మధ్య ఉన్న లిఫ్ట్.

తేది: 21.08.2025
ప్రదేశము: విజయవాడ

అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బోధనకు దూరం చేసేలా మార్పులు

అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసేందుకే పరీక్ష విధానంలో మార్పులు చేపట్టి, బుక్‌లెట్ అసెస్మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టారని యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు విమర్శించారు. నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రాంతీయ శాఖల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి పూర్తిగా మినహాయించాలన్నారు. ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల విధానాన్ని పాత పద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్, శిక్షణ తరగతుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశారని, ప్రతిరోజూ ఏదో ఒక సమాచారం అత్యవసరమంటు, విద్యా కిట్లు పంపిణీ అప్లోడ్‌తో పాటు ఇతర యాప్‌లలో నమోదుతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వివరించారు. యాప్‌ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకేయాప్‌లో అనేక సమాచారాలు పెట్టమంటున్నారని, అధికారుల ఒత్తిడి తట్టుకోలేక పోతున్నామని అన్నారు. ఇటీవల జరిగిన ఫార్మేటివ్ అసెస్మెంట్లో సిలబస్‌లో లేని ప్రశ్నలను ఇచ్చి విద్యార్థులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టడంతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు పరీక్షల్లో రావనే అపవాదు వస్తోందని చెప్పారు. 1వ తరగతి విద్యార్థులు పేరాగ్రాఫ్ చదివి ప్రశ్నలకు జవాబులు తెలియజేయమనడం ద్వారా వారి స్థాయిని దృష్టిలో పెట్టుకోకుండా వ్యవహరించారని అన్నారు. విద్యార్థులకు అందజేసిన అసెస్మెంట్ పుస్తకాల్లో విద్యార్థుల కంటే ఉపాధ్యాయులకే ఎక్కువ రాత పని ఉండేవిధంగా తయారు చేశారని, వందల మంది విద్యార్థులున్నచోట ఒక ఉపాధ్యాయుడు ఇలాంటి కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో అర్థం కాని గందరగోళ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు పూర్తిగా బోధనకు దూరమవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. పరీక్షలు విద్యార్థులు రాస్తున్నారా? ఉపాధ్యాయులు రాస్తున్నారా? అనే ప్రశ్న నేడు పాఠశాలల్లో నెలకొందన్నారు. అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చడం సరికాదన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సుందరరావు, నరసరావుపేట ప్రాంతీయ శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పూర్ణచంద్రరావు, వై.శ్రీనివాసరావు, బాషా, సిహెచ్ రామాంజనేయులు, లింగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం. మోహనరావు

ఎరువుల అక్రమాల నియంత్రకు తనిఖీ బృందాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు రాయితీపై అందిస్తున్న ఎరువుల అక్రమ నిల్వలు, క్రయ విక్రయాలు, పక్కదారి పట్టడం వంటి కార్యక్రమాలను నియంత్రించేందుకు మండల స్థాయిలో తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బృందాలు రోజు వారీగా మెరుపు దాడులు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు యూరియా పంపిణీని తనిఖీ బృందాలు పర్యవేక్షిస్తాయని చెప్పారు. తహశీల్దార్, ఎస్ఐ, మండల వ్యవసాయ అధికారి మండల స్థాయి తనిఖీ బృందంలో సభ్యులుగా వ్యవహరిస్తూ మండలంలోని అన్ని ఎరువుల డీలర్ అవుట్‌లెట్‌లను తనిఖీ చేయాలన్నారు. ఈ-పోస్ పరికర బ్యాలెన్స్‌లను భౌతిక స్టాక్‌తో సరిపోల్చాలని, నిర్ధారణ కోసం ఈ-పోస్ లో నమోదు చేయబడిన రిటైలర్ల స్టాక్ రసీదులు అంగీకార పత్రాలను నిశితంగా పరిశీలించాలని చెప్పారు. ఉల్లంఘనలను గుర్తిస్తే సంబంధిత డీలర్లు/పరిశ్రమలపై ఎఫ్.సి.ఓ 1985, ఇసి చట్టం, 1955 ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులకు ఎరువులను పారదర్శకంగా అందజేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తనిఖీ, చర్యల నివేదికలను ఆలస్యం చేయకుండా సమర్పించాలన్నారు. యూరియా టెక్నికల్ గ్రేడ్ యూరియా సరఫరా, స్టాక్ స్థానాన్ని పర్యవేక్షించాలన్నారు. ఎరువుల సరఫరాలో రైతుల నుండి ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించాలని, యూరియాను ముడి సరుకుగా ఉపయోగించే అన్ని పరిశ్రమలను, సరిహద్దుల మీదుగా కదలికలను బృందాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. రైతుల అవసరాలకు తగ్గట్టు ఎరువులు పంపిణీ చేయాలన్నారు.

టిడ్కో ఇళ్లపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

టిట్కో ఇళ్లను లబ్ధిదారులకు త్వరగా అందించాలని పల్నాడు జిల్లా కలెక్టర్‌ను నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఎమ్మెల్యే శనివారం వినతిపత్రం ఇచ్చారు. రొంపిచర్ల మండలంలోని విప్పర్ల, కొత్తపల్లి రహదారుల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు, టిట్కో ఇళ్లను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సామాన్యులకు అపూర్వ అవకాశాన్నిచ్చిన స.హ.చట్టం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఫోరమ్ ఫర్ ఆర్‌టిఐ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. ఫోరమ్ ఫర్ ఆర్‌టిఐ రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రమోహన్, నాయకులు బత్తుల మురళి, రాష్ట్ర సమాచార కమిషనర్ ప్రతిపాటి శామ్యూల్ జొనాథన్ ప్రసంగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్య పౌరులకు అపూర్వమైన అవకాశాన్ని కల్పించిందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రజలు ప్రభుత్వ విధానాలు, నిర్ణయాల గురించి సమాచారం పొందవచ్చని తెలిపారు. ఇది అవినీతిని నిరోధించడంతో పాటు పాలనలో పారదర్శకతను పెంచుతుందని చెప్పారు. ఫోరమ్ ఫర్ ఆర్‌టిఐ వంటి సంస్థలు ఈ చట్టం ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. భారతదేశంలో సంచార జీవులైన లక్షలాది



మంది ప్రజలు కనీసం కుల ధ్రువీకరణ పత్రం కూడా పొందలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 జనాభా లెక్కల ప్రకారం, దేశంలో సుమారు 1.77 కోట్ల మంది సంచార జాతులకు చెందినవారు ఉన్నారని, వీరిలో 60 శాతం మందికి గుర్తింపు పత్రాలు లేవని ఒక అధ్యయనం తెలిపినట్లు వివరించారు. ఈ పరిస్థితి వారి హక్కుల సాధనకు అడ్డంకిగా ఉందన్నారు. ఓటు దొంగతనం సమస్యను ప్రస్తావిస్తూ, ఓటర్ ఐడీకి ఆధార్ కార్డును అనుసంధానం చేయడం ద్వారా ఈ సమస్యను నిరోధించవచ్చని సూచించారు. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 1.8 శాతం ఓటరు జాబితాలో నకిలీ ఓట్లు ఉన్నట్లు గుర్తించబడ్డాయని అన్నారు. ఆధార్-ఓటర్ ఐటి అనుసంధానం ద్వారా ఓటు దొంగతనాన్ని పూర్తిగా అరికట్టవచ్చని, దీన్ని తప్పనిసరి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర కేసరిగా ప్రసిద్ధి చెందిన ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో ప్రకాశం పంతులు కీలక పాత్ర పోషించారని, సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ఆయన చూపిన ధైర్యం, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన త్యాగాలు ఆంధ్ర ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ప్రకాశం జిల్లాలోని వినోదరాయునిపాలెంలో నిరుపేద కుటుంబంలో పుట్టినా బారిస్టర్‌గా ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. 1928లో మద్రాసులో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలో తుపాకీక ఎదురునిలిచి, సవాలు చేసిన ఆయన ధైర్యసాహసాలు ఆంధ్ర కేసరి అనే బిరుదును సంపాదించాయన్నారు. ఆయన పాలనలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపన, కృష్ణా నదిపై విజయవాడ వద్ద బారేజ్ నిర్మాణం, 2000 మంది ఖైదీలకు క్షమాభిక్ష వంటి పలు కీలక సంస్కరణలు జరిగాయని చెప్పారు. 1921లో ఆయన ప్రారంభించిన 'స్వరాజ్య' దినపత్రిక ఆంధ్ర ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు.



మహిళాభ్యుదయమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ


ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్త్రీ శక్తి విజయోత్సవ సభ సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించారు. సభకు ఎమ్మెల్యేతోపాటు టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళాభ్యుదయమే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఆడబిడ్డలను, అక్కా చెల్లెమ్మలను సామాజికంగా, ఆర్థికంగా పైకి తీసుకువచ్చి, వారి కాళ్లపై వారు సొంతంగా వ్యాపారాలను చేసుకుని ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీశక్తి మహిళా ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మహిళలు అండగా నిలవాలని కోరారు. రోజు పనిచేసే మహిళలకు, విద్యార్థినులకు, చిన్నపాటి మహిళ ఉద్యోగస్తులకు ఉచిత బస్సు పథకం ద్వారా ప్రయాణ ఖర్చులు భారం తగ్గుతుందని అన్నారు. ఈ సందర్భంగా రూ.6 కోట్ల 50 లక్షల 80 వేల స్త్రీనిధి చెక్కును డ్వాక్రా మహిళలకు అందచేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు వై.రామస్వామి, బి.వందనాదేవి, టి.అంబిక, డి.నాగేశ్వరరావు, ఎం.రాంబాబు, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటికీ కుల వివక్ష బాధాకరం : జడ్జి

ప్రజాశక్తి - మాచర్ల : స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా ఇప్పటికీ సమాజంలో కుల వివక్షతకు చోటు ఉండటం బాధాకరమని మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్, ప్రధాన సివిల్ జడ్జ్ శ్రీనివాస్ కళ్యాణ్ అన్నారు. మండల న్యాయ సేవ కమిటీ మాచర్ల ఆధ్వర్యంలో చట్టాలపై స్థానిక ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల పట్ల ఎవరైనా వివక్షత చూపినా, దౌర్జన్యం చేసిన వారికి చట్టపరంగా శిక్షలు తప్పవని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ఎవరైనా బాధితులు ఈ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. పౌర హక్కుల రక్షణ చట్టం 1955 ప్రకారం పౌరుల హక్కులకు భంగం కలిగినప్పుడు, బాధించిన వారిపై చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది జి.వరప్రసాద్, వసతి గృహ సంక్షేమ అధికారులు నూరుల్లా బేగ్, ఎన్.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

100 బంగారు కుటుంబాల్ని దత్తత తీసుకున్న జీవీ దంపతులు

నూజెండ్ల మండలం కమ్మవారిపాలెంలో లబ్ధిదారులతో సమావేశమై సమస్యల నమోదు



సమస్యలను నమోదు చేసుకుంటున్న జీవీ దంపతులు

ప్రజాశక్తి - వినుకొండ

పేదరికం నిర్మూలన కోసం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పి-4లో భాగంగా 100 బంగారు కుటుంబాలను చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దంపతులు దత్తత తీసుకున్నారు. నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం గ్రామంలో ఎంపిక చేసిన 60 కుటుంబాల వారు సమావేశమయ్యారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సెంటు పొలం గానీ, గజం జాగా గానీ ఏమీ లేని నిరుపేద ఎస్టీ కుటుంబాల్లో వెలుగు కోసం ఈ చొరవ తీసుకున్నామన్నారు. పిల్లలను చదివించుకోవడం, చివరకు వారికి బట్టలు కొనేందుకు కూడా స్తోమత లేని వారిని శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఆదుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మరో 40 కుటుంబాలను వినుకొండ పట్టణంలో చెంచులు, యానాదులు, ఇతర వర్గాల నుంచి ఎంపిక చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేరుతో కమ్మరివారిపాలెంలో కాలనీ నిర్మించి ఇస్తామన్నారు. పిల్లల్ని సకాలంలో స్కూల్‌కు తీసుకుని వెళ్లేందుకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఒక ఆటో కూడా అందిస్తామని తెలిపారు. ఆ కుటుంబాలు మొత్తాన్ని ఆర్థిక స్వాతంత్రతతో సంతోషంగా జీవించేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. తమలానే ఇలా బంగారు కుటుంబాల దత్తతకు ముందుకు వచ్చిన వారందరికీ అభినందనలు తెలిపారు. జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ లీలావతి మాటాకలడేతే కమ్మరివారిపాలెం ఎంపిక చేసిన బంగారు కుటుంబాల పరిస్థితులు చూసినప్పుడు సిఎం చంద్రబాబు తమకు మంచి అవకాశం ఇచ్చారని అనిపించిందన్నారు. ఇలాంటి కాలనీలకు వచ్చినప్పుడు అసలైన కష్టాల గురించి తెలుసుకునే వీలుంటుందని అన్నారు. లబ్ధిదారుల కుటుంబాలతో మాట్లాడినప్పుడు వారి అవసరాలన్నీ రాసుకున్నామని, రానున్న రోజుల్లో వాటికి తగినవిధంగా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అవకాశం ఉన్న వారంతా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



బంగారు కుటుంబాలతో చేస్తున్న జీవీ దంపతుల కరచాలనం



పేదల సొంత ఇంటి కల.. తీరేదెన్నడో...!

- గత ప్రభుత్వం సెంటు స్థలం పేరుతో 5500 మందికి పట్టాలిచ్చారు..
- రాజధాని పరిధిలో ఆ స్థలాలు ఉండడంతో అభ్యంతరం వ్యక్తం చేసిన కోర్టు
- రెండు సెంట్ల స్థలం ఇచ్చేది ఎప్పుడో..

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలో ఇల్లు లేని, ఇళ్ల స్థలం లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. తమ సొంత ఇంటి కల తీరేదెన్నడో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక సార్లు ఇళ్ల స్థలాల కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. గతంలో జగన్ ప్రభుత్వం సెంటు స్థలం పేరుతో రాజధాని అమరావతి ప్రాంతంలోని గ్రామాలలో పట్టాలు ఇవ్వడం జరిగింది. మంగళగిరి పట్టణ పరిధిలో 5500 మందికి ఇవ్వడం జరిగింది. రాజధాని పరిధిలోని భూముల్లో ఇవ్వడం వలన రాజధాని అమరావతి రైతులు కోర్టుకు వెళ్ళగా కోర్టు ఇళ్ల స్థలానికి ఇవ్వడానికి వీల్లేదని స్టే విధించింది. దీంతో ఎన్నో సంవత్సరాలగా ఎదురుచూస్తున్న పేదల ఇళ్ల స్థలాల ఆశ అడియాశలు అయ్యాయి. 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే పట్టణాల్లో పేదలుగా ఉన్నవారికి రెండు సెంట్లు స్థలం ఇస్తామని, రూరల్ గ్రామాల్లో ఉన్న వారికి మూడు సెంట్లు స్థలం ఇస్తామని వాగ్దానం చేశారు. భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. మంగళగిరి పట్టణంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవు. కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పోరంబోకు స్థలాలను ఆక్రమించి ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలి ఇవ్వడం జరిగింది. అనేక కాలనీలు ఏర్పడ్డాయి. అలా ఏర్పడిన కాలనీలో కొంతమందికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం జరిగింది. ఇటీవల మంగళగిరి నియోజకవర్గంలో ఇల్లు వేసుకొని నివాసముంటున్న పేదవారికి 3000 మందికి పైగా ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగింది. ఇళ్ల స్థలాలు మాత్రం ఎన్నడు ఇవ్వలేదు. అనేక సంవత్సరాలుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారు. స్థలం లేని నిరుపేదలు సాలీసాలను వేతనాలతో జీవనం సాగిస్తూ ఉన్నారు. శివారు ప్రాంతంలోని చిన్న చిన్న ఇళ్లల్లో అద్దెలకు ఉంటున్నారు. కనీసం అద్దె నెలకు 3000 రూపాయలు చెల్లించాలి వస్తుంది. పాలక పార్టీలు ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా హామీలను అమలు పరిచే పరిస్థితిలో లేకపోవడంతో మరల పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం రోజువారి పని కూడా పేదలకు దొరకని పరిస్థితి మంగళగిరిలో ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో సొంత ఇల్లు అన్న ఏర్పాటు చేసుకుందామంటే ఇళ్ల స్థలము లేక అద్దె ఇంట్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుండి ఇప్పటివరకు రెండు సెంట్లు స్థలం సంబంధించిన దరఖాస్తులు పెట్టుకోవడానికి ఎలాంటి ఆదేశాలు రావడంలేదని పేదలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేదలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నారు.

ఎలాంటి ఆదేశాలు లేవు..

కాగా రెండు సెంట్లు స్థలం పేదవానికి ప్రభుత్వం ఇచ్చే దానిపై ఇంతవరకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. దరఖాస్తులు తీసుకోమని గానీ, సర్వే చేయమని గాని ఎలాంటి ఆదేశాలు రాలేదని వారు తెలిపారు.



మాట్లాడుతున్న కేసన శంకరరావు

మహిళల నిరాహార దీక్షలను జయప్రదం చేయండి : కేసన శంకరరావు

ప్రజాశక్తి - మంగళగిరి

"బీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ, మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసిన తరువాతే అమలు జరపాలి" అని కోరుతూ ఈనెల 30వ తేదీ విశాఖపట్నంలో జరిగే "మహిళల నిరాహార దీక్ష"లను జయప్రదం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బీసీ మహిళా లోకానికి పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కేసన మాట్లాడుతూ జాతీయస్థాయిలో జన గణనలో కులగణన జరిగి, ఆపై నియోజకవర్గాల పునర్వి భజన చేసిన అనంతరమే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ కార్య నిర్వాహక రాష్ట్ర అధ్యక్షులు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, ఉడత శ్రీనివాసరావు, జన్జనం వరప్రసాద్, జయలక్ష్మి, దుర్గ, దానాగౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

జెఎంజెలో క్యాన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి



వైద్య బృందంతో కళాశాల అధ్యాపకులు

స్థానిక జెఎంజె మహిళా కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ బృందం పాల్గొని అధ్యాపకులు, విద్యార్థినులకు మహిళలలో సంక్రమించే వివిధ రకాల క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. క్యాన్సర్‌కు కారణాలు, దాని నియంత్రణ చర్యలు, వ్యాధి సోకిన వారు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ శాంత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ రోజలిన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి విద్యార్థినులుపాల్గొన్నారు.

ఉపాధి శ్రామికుల వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఫిరంగిపురం



మాట్లాడుతున్న ఈమని అప్పారావు

మండలంలోని ఉపాధి హామీ పనిచేసిన శ్రామికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు జరిగి రెండు నెలలు కావలస్తున్నా నేటికీ ఉపాధి శ్రామికులకు ఆరు ఏడు వారాలుగా చేసిన పనికి వేతనాలు ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పనులు లేక కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని, దీనికి తోడు చేసిన పనికి డబ్బులు రాకపోతే అప్పులు చేసి జీవనం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పటికీ యూరియా అందుబాటులోకి రాలేదని , వ్యవసాయ మంత్రి అధికారులు యూరియా కొరత లేదని చెబుతున్నారే తప్ప ఆచరణలో శూన్యమని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఫిరంగిపురం గ్రామంలో మంచినీరు లేదని పంచాయతీ ద్వారా వచ్చే నీటిని వాడటం వల్ల దురదలు, దద్దుర్లు వస్తున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఫిరంగిపురం మండల కార్యదర్శి ఎస్.కె.మస్తాన్ వలి, వ్యవసాయ కార్మిక సంఘం ఫిరంగిపురం నాయకులు ఆకారపు అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నుండి యువతను కాపాడాలన్నదే లక్ష్యం

డ్రగ్స్ కేసులో పట్టుబడితే పది నుంచి 20 ఏళ్లు జైలు

ప్రజాశక్తి - మంగళగిరి



మాట్లాడుతున్న ఈగల్ ఎస్పీ నగేష్ బాబు

యువతరాన్ని డ్రగ్స్ నుంచి కాపాడాలన్నదే తమ లక్ష్యం అని గుంటూరు ఈగల్ ఎస్పీ నగేష్ బాబు తెలిపారు. మంగళగిరిలోని శ్రీ చైతన్య కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్ఫలితాలపై మార్కండేయ పద్మశాలియ కళ్యాణ మండపంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డ్రగ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ ఎస్పీ నగేష్ బాబు మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం వలన కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఇప్పటికే 8వేల అవగాహన శిబిరాలను నిర్వహించినట్లు చెప్పారు. సెంట్రల్ జైల్లోనూ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్రగ్స్ వినియోగిస్తూ, సరఫరా చేస్తూ, పట్టుబడితే ఎన్డిపిఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, ఫలితంగా పది నుంచి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో తరచూ పట్టుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి అనే లక్ష్యంలో భాగస్వాములు అవుతున్నట్లు చెప్పారు.నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్ఫలితాలను విద్యార్థిని, విద్యార్థులకు వివరించి వారికున్న సందేహాలను నివృత్తి చేసినట్లు చెప్పారు. డ్రగ్స్‌కు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు 1972 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉందని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఎస్ఐ శ్రీహరి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎరువుల కొరత లేదు

ప్రజాశక్తి - తెనాలి

ఖరీఫ్ సీజన్లో తెనాలిలో ఎరువుల కొరత లేదని ఏడిఏ కె రాజకుమారి, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు చెప్పారు. శనివారం ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తెనాలి మండలంలో 7208 హెక్టార్లలో వరి, 2 హెక్టార్లలో అరటి, 10 హెక్టార్లలో పసుపు, 10 హెక్టార్లలో కూరగాయలు పండిస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డిసిఎంఎస్ ద్వారా ఎరువుల లభ్యత పుష్కలంగా ఉందన్నారు. ప్రస్తుతం యూరియా 176 మెట్రిక్ టన్నులు, డిఎపి 179 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 575 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 42 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తెనాలి అర్బన్, రూరల్ పరిధిలోని బుర్రిపాలెం, కంచర్లపాలెం, పెదరావూరు రైతు సేవా కేంద్రాలకు, కొలకలూరు పిఎసిఎస్ కు ఎరువులు రానున్నట్లు వెల్లడించారు. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూరియా సరఫరాపై మంత్రి మనోహర్‌కు విజ్ఞప్తి

ప్రజాశక్తి- తెనాలిరూరల్

యూరియా, డిఎపి సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని శనివారం ఓ ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. దుగ్గిరాల, వేమూరు మార్కెట్ యార్డుల్లో సరఫరా చేస్తున్న ఎరువులు తెనాలిలో యూరియ ఎందుకు సరఫరా చేయడంలేదని ప్రశ్నించారు. రూ 266.64 లకు అందాల్సిన యూరియాను రూ. 400 నుంచి రూ. 450 లకు కొనుగోలుచేసే పరిస్థితి నెలకుందని అన్నారు. శుక్రవారం కొల్లిపర మండలంలోని పర్యటించిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రైతులు ఎరువుల కొరతపై విన్నవించారని, మంత్రి జోక్యం చేసుకొని తెనాలి, కొల్లిపర మండలాల్లో డిఎపి, యూరియా కొరత లేకుండా రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పెదనందిపాడు

తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ శనివారం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో సి.ఐ.టి.యు. ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కరీముల్లాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు.నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, తెలగతోటి నాగేశ్వరరావు లు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ నుండి ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన కారణంగా ఆటోలు ఎక్కేవారు లేక కుటుంబాలు గడవడం కష్టం గా ఉందని అన్నారు. రోజు వారి వచ్చే ఆదాయంతోనే ఆటో కార్మికులు తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని అన్నారు. ఆటో అద్దె కట్టేందుకు కూడా డబ్బులు రావడం లేదని అన్నారు. ఇలాంటి పరిస్తితులలో ప్రభుత్వం ఆటో కార్మికులను అన్ని విధాల ఆదుకోవాలని, నెలవారీ పదిహేను వేలు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు కట్టా విజయవర్మ, రత్నం, కిశోర్ బాబు, రవివర్మ, అంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పౌర సన్మానం అందుకున్న అధికారులు

అంకితభావంతో పని చేస్తే అవార్డులు
మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కష్టపడి అంకితభావంతో పనిచేస్తే అవార్డులు సొంతం చేసుకోవచ్చని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ అన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో మాచర్ల ప్రాంతం నుంచి జిల్లా స్థాయిలో మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అధికారు లకు పౌర సన్మానం జరిగింది. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి మాచర్ల మున్సిపల్ చైర్మన్ అధ్యక్షత వహిస్తూ ఉత్తమ అధికారులుగా ఎంపిక కావడం వెనుక కఠోరమైన దీక్ష, విధుల పట్ల అంకితభావం ఉంటుందని, అటువంటి అధికారులు మాచర్ల ప్రాంతం నుండి ఎక్కువ మంది ఎంపిక కావడం మాచర్లకు ఎనలేని ఖ్యాతిని తీసుకు వచ్చినదని అన్నారు. పౌరసన్మానం పొందిన వారిలో డిప్యూటీ కలెక్టర్ కె. రమేష్ బాబు, తహశీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయిని సాంబేలు శాంతి బాయ్, హౌసింగ్ ఏఈ మరియదాసు, ఇన్‌స్పెక్టర్ ఆలీ ఉన్నారు. కార్యక్రమంలో మాచర్లవాసు, పాషావలి, ఆంజ నేయులు, డాక్టర్ కమలహాసన్, డాక్టర్ ద్రాక్షాయిని, పెన్షనర్లు రామనాథ శర్మ, చంద్రయ్య, ఏజీపీ గంగుల శ్రీనివాసరావు, లాయర్ జీవి, బంగారమణ, బాదంబాయ్ పాల్గొన్నారు.

సురవరం మృతికి ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువజన-విద్యార్థి రంగాలను సమైక్యంగా నడిపిన విప్లవ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అకాల మరణం పట్ల నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సంతాపం వ్యక్తం చేశారు. సుధాకర్‌రెడ్డి కార్మిక, రైతాంగ, యువజన, విద్యార్థి వర్గాల హక్కుల కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తని ఎమ్మెల్యే కొనియాడారు. వారి ఆదర్శాలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యా పకులు, సిబ్బంది కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వ హించారు. గుంటూరు కొనాక్ డయాగ్నస్టిక్స్ ఆధ్వ ర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్, గుండె సంబంధిత సమస్యలు, మూలఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్.కె.మీరా వలి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె మస్తాన్ షరీఫ్, సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్.కెకరీం మొహిద్దిన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.కె నజీమా, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నాగమల్లే శ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


టంగుటూరి ప్రకాశం పంతులకు నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, టంగుటూరు ప్రకాశం జయంతి కార్యక్రమం జరిగింది. గార్డ్స్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నాయుడు వాసు పాల్గొని మాట్లాడారు. ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలు వివరించారు. కార్యక్రమంలో గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, సభ్యులు వడ్ల నా సతీష్ చంద్ర, దాసరి మనోజ్ కుమార్, బెజ్జం రవి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డా.దార్ల బుజ్జిబా బు, మాజీ వడ్డెర వెల్ఫేర్ కమిటీ సభ్యులు గుంజి వీరాంజనేయులు, షేక్ లాలూ దాదా సాహెబ్ సేవాసమితి అధ్యక్షులు సిద్ధాంతి కరిముల్లా, ఆర్య వైశ్య కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి చేవూరి కష్ణమూర్తి బత్తుల విక్రమ్, కురిచేటి వీరబ్రహ్మం, బుల్లి పాల్గొన్నారు.

రాష్ట్రానికి పెనుసవాల్‌గా పేరుకుపోయిన చెత్త : చీఫ్ విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆంజనేయులు

రాష్ట్రంలో అయిదేళ్ల వైకాపా పాలనలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు ఇప్పటికీ సవాల్‌గా మిగలడం వారు చేసిన నష్టానికి, అరాచక, అడ్డగోలు పాలనకు నిదర్శనమని మండిపడ్డారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. చెత్త పన్ను వేసింది కాక మొత్తం 87లక్షల టన్నుల చెత్తను ఎక్కడికక్కడ కొండల్లా వదిలేసి పోయారని ఏడాదిగా వాటికి పరిష్కారం చూపడానికే శ్రమించాల్సి వస్తోందన్నారు. ఉన్న ఆ చెత్త చాలదన్నట్లు నిత్యం జగన్, వైకాపానేతలు, వారి అవినీతి పుత్రిక సాక్షి, కొన్ని దారి తప్పిన సోషల్ మీడియా ఛానెళ్లు మరింత చెత్త కుమ్మరిస్తూ, వాతావరణాన్ని, సమాజంలో సఖ్యతను, శాంతిభద్రతల్ని చెడగొట్టాలని చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు విషప్రచారం, అసత్యాలను ప్రచారం చేసినందుకు ప్రజలు బుద్ధి చెప్పారని, అయినా వారిలో మార్పు రాలేదని ఇకనైనా తీరు మార్చు కోవాలని హితవు పలికారు. వినుకొండలో శనివారం స్వచ్ఛతా ర్యాలీలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి చెత్తను శుభ్రం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యా లయం నుంచి బోసుబొమ్మ సెంటర్, పాత శివాలయం మీదుగా విద్యార్థులతో నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్నారు. జీవీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చెత్తాచెదారం రోడ్లపై కాక ఆ బుట్టల్‌లోనే వేయాలని కోరారు. డ్రైనేజీల్లో చెత్తాచెదార వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పనికిరాని మొక్కల్ని తొల గించాలన్నారు. డ్రైనేజీలతో పాటు ప్రతి వీధి, బజారును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు నాయకులు, పాల్గొన్నారు.

నవధాన్య సేద్యం- భూమాతకు నైవేద్యం

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలోని పెద కొదమగుండ్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు కందుల రమేష్ వ్యవసాయ క్షేత్రాన్ని శనివారం మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య సందర్శించారు. పిఎండిస్(30రకాల విత్తనాలు)లో పంట కోత ప్రయోగం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కందుల. రమేష్ జూన్ మొదటి వారంలో పీఎండిస్ వేశామనీ, ఈ పిఎండిస్‌లో30 రకాల విత్తనాల్లో వివిధ రకాల జాతులు ఆహార ధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, దుంప జాతి పంటలు వేసినట్లు తెలిపారు. 5మీ5మీలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 61.700కిలోలు, అంటే ఎకరాకు 10 టన్నులు వచ్చాయన్నారు. మిరప, కంది,వరి, కూరగాయలు వివిధ రకాల పంటలు వేసే ప్రతి రైతు ఈ ప్రకృతి వ్యవసాయ విధానంలో పీఎండిఎస్ విధానాన్ని ఆచరించాలని దీని వలన రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని తెలియజేశారు. జిల్లా సిబ్బంది అప్పలరాజు మాట్లాడారు. ఈపీఎండిఎస్‌ను పశువుల మేతగా కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. ఆకు కూరలు, కూరగాయలు కుటుంబ అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలియజేశారు. ప్రధాన పంటలో కలుపు నివారణ జరుగుతుందని, భూమికి నీటిని పట్టి ఉంచే గుణం పెరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో పార్వతి,నాగమణి,నాగజ్యోతి, స్వయం సహాయక సంఘం మహిళలు రైతులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వ్యవసాయ సలహా, సాంకేతిక కేంద్రాల నుంచి వ్యవసాయ శాస్త్రవేత్త నగేష్ మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రత్తి పంట పొలాలను సందర్శించారు. ప్రత్తి పంటలో గులాబి రంగు పురుగును నియంత్రించడానికి ఫెరమోన్ ట్రాప్స్ ఎకరానికి 20 చెప్పున పెట్టుకోవాలని సూచించారు. ప్రత్తి పంటలో తెల్ల దోమ నివారణకు లీటరు నీటికి డైఫెన్తురియన్ 1.25 గ్రాములు, పచ్చ దోమ నివారణకు లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. పిండి నల్లి నివారణకు లీటరు నీటికి ప్రొఫెనోఫాస్ 2.5 మి.లీ కలిపి పిచికారీ చేయాలని తెలియ చేసారు. కార్యక్రమంలో మాచర్ల వ్యవసాయ విస్తరణ అధికారి మార్కండేయులు, కొత్తపల్లి రైతు సేవా కేంద్రం సిబ్బంది, వెంకటేశ్వర్లు, కొత్తపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

కాల్వపై కరెంటు తీగలు తొలగించాలని ఆందోళన

ప్రజాశక్తి - వినుకొండ

విఠంరాజు పల్లి, బ్రాహ్మణపల్లి ఎన్ఎస్పి కాలువపై అడ్డంగా ఉన్న తీగలు తొలగించాలని రైతులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ గతంలో విద్యుత్ అధికారులకు అర్జీ ఇస్తే వచ్చి పరిశీలించి స్తంభం పడిపోకుండా రిపేర్ చేయిస్తే తీగలు తొలగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారన్నారు. స్తంభం చుట్టుప్రక్కల రిపేర్ చేయించిన విద్యుత్ అధికారులు స్పందించలేదనీ, స్థానిక తహశీల్దార్‌కి గ్రీవెన్స్ సెల్ మెమోరాండం ఇచ్చామనీ, తక్షణమే రోడ్డుపై అడ్డంగా ఉన్న కరెంటు తీగలు తొలగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడియం రాష్ట్ర నాయకులు, వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, పగడాల చిన్నకోటిరెడ్డి, కంఠా రంగారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు


ఉపాధి హామీ నిధులు విడుదల

ప్రజాశక్తి - పెదకూరపాడు

2014-19 ఉపాధి హామీ పథకం బిల్లులు 176 కోట్లు ప్రభుత్వం విడుదల చేయడంపై పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు. 2014-19లో నియోజకవర్గంలోని గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులను చేసిన స్థానిక నాయ కులు, సర్పంచ్‌లు, ఉపాధి హామీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాజకీయ కక్షతో అభివద్ధి పనులు చేసిన వారికి అప్పట్లో బిల్లులు చెల్లించకపోవడంతో, కోర్టుద్వారా రూ.2600 కోట్లు తెప్పించి ఇవ్వడం జరిగిందన్నారు. మరోరూ.400 కోట్లు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఎలాంటి షరతులు లేకుండా ఈ ప్రభుత్వం రూ. 176 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. పెదకూరపాడు నియోజక వర్గంలో 128 పనులకు గాను రూ.76,75000లను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. పనులు చేసిన వారి ఖాతాల్లో నేరుగా ఈ నిధులు జమ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా రావాల్సిన పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మానసిక వికలాంగులను ఆదుకోండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ప్రభుదాస్ జయంతీ

సమాజానికి దూరమై, బతుకుభారమై కన్నవారి మానసిక వ్యధగా మిగిలిన మానసిక వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ దయార్థ్ర హృదయం కలిగి ఉండాలని ప్రభుత్వం రిటైర్డ్‌ఉద్యోగ సంఘ నాయకులు అంకాళ్ళ ప్రభుదాసు అన్నారు. శనివారం ఆయన తన సహధర్మచారిణి అంకాళ్ళ జయంతితో కలసి స్థానిక పరివర్తన వికలాంగుల ఆశ్రమంలో టంకాల వెంకటరమణమ్మ జ్ఞాపకార్థకం ఆమె కుమార్తె ష్ణవేణి, అల్లుడు కిరణ్‌కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆల్పాహారాన్ని విద్యార్థులకు అందించారు.

నేడు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పెదకూరపాడు

క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ జరీనా జానీ ప్రమాణ స్వీకారానికి తరలిరావాలని పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, టిడిపి జిల్లా కార్యదర్శి ఆర్తిమళ్ళ రమేష్ కోరారు. శనివారం స్థానిక పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు క్రోసూరు మార్కెట్ యార్డు ఆవరణలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ బెల్లంకొండ గోపాలరావు, డిసి చైర్మన్ వడ్లమూడి అప్పారావు, పాటిబండ్ల బాలయ్య, సరిపూడి గోపి, గంగినేని చిన్న, షేక్ దిలీపు, షేక్ రెహ్మాన్ పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - వినుకొండ

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ వారి వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆధ్వర్యంలో మండల న్యాయ సేవాధికార సంస్థ, వినుకొండ వారు సెప్టెంబర్ 13వ తేదీ రెండవ శనివారము వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లుగా వినుకొండ మండల న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఎసి చైర్మన్, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)కోర్టు న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదం పాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ముందస్తు రాజీ చేసుకోదలచిన కేసులను ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు.

30, 31న రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - వినుకొండ

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహా సభలను ఈనెల 30,31 గుంటూరు నగరంలోని వెంకటేశ్వర విజ్ఞానం మందిర్‌లో నిర్వహించ నున్న రాష్ట్ర మహా సభలకు న్యాయవాదులు హాజరు కావలసినదిగా వినుకొండ న్యాయవాద సంఘం అధ్యక్షులు మీసాల. శ్రీనివాసరావు, కార్యదర్శి పఠాన్. గౌస్ మొహద్దీన్ ఖాన్, ఉపాధ్యక్షులు పివి. రమణరెడ్డి, సహాయ కార్యదర్శి నీలం. శేఖర్ బాబు, కోశాధికారి వరగాని. శివశంకర్ బాబు, పిలుపునిచ్చారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ముప్పాళ్ళ. జ్ఞానేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు ముట్లూరి. ఎలేషా బాబు, భీమవరపు. శ్రీనివాసులు బి రామ్మోహన్ మారెళ్ళ .సీతారామాంజనేయులు రెడ్డి బోయిన. బాబు ,దుగ్గిపోగు. విజయ్, శివా నాయక్, లాస్టూడెంట్ మస్తాన్ వలిపాల్గొని వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

ప్రజాశక్తి - నాదెండ్ల

మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర (నేటి అంశం-వర్షాకాల పరిశుభ్రత) కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ ఎస్.చంద్రశేఖర్, సీడీపీవో శాంత కుమారి, ఎంపీడీవో స్వరూప రాణి, ఎపిఎం రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, నాదెండ్ల పిఎసిఎస్ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు, నాదెండ్ల సర్పంచి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు, గ్రామ సచివాలయాల సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తెలుగు జాతికి, మాతృ భాషాభిమానులకు ద్రోహం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దేశంలో అత్యంత కీలక పాత్ర వహించే ఉపరాష్ట్రపతి ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేస్తే తెలుగు భాషకు పుట్టినిల్లయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఒక్క ఓటు కూడా పడకుండా చూసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హోమ్ మంత్రి అమిత్‌షా ప్రశంసలందుకు నేందుకు తెలుగుదేశం, వైకాపా, జనసేన పార్టీ ఉత్సాహం చూపిస్తున్నాయని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎం.రాధాకష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి సిపి రాధాకష్ణన్ గెలుపు కోసం ఐక్యంగా కృషి చేయడం తెలుగు జాతికి తీరని ద్రోహం చేయడమేనని పేర్కొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన చైర్మన్ సాంబశివరావు

మంగళగిరిలో అన్నదాన మహోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శివాలయం వద్ద గల శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర అన్నదాన మహోత్సవం కార్యక్రమం జరిగింది. శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం శనివారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావుతో పాటు జనసేన నియోజకవర్గ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు స్వయంగా అన్నప్రసాద వితరణలో పాల్గొని భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, పంచల శివన్నారాయణ, చాగంటిపాటి దేవవర్ధన్, ఖడ్గ శ్రీనివాసరావు, పందేటి శ్రీను, కళ్ళం శివ సాంబిరెడ్డి, ఆలూరి ఉమామహేశ్వరరావు, ప్రసాద్, భోజన పల్లి తాండవ, చీదేళ్ల వాసు, కోదాడ శ్రీనివాసరావు, చిరుమామిళ్ల రంగారావు, యేల్చూరి వెంకట సుబ్బారామిరెడ్డి, వీర రాఘవులు, నంద్యాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ తరలి రావాలి

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్.టి.రామారావు విగ్రహ ఆవిష్కరణకు ప్రతి ఒక్క అభిమాని, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తరలి రావాలి అని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకఅష్ణ పిలుపునిచ్చారు. శనివారం తక్కెళ్ళపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు నందిపాటి బసవయ్య మాట్లాడుతూ ఎన్టిఆర్ ఏ ఒక్క కులానికో మతానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన రాజకీయాలలోకి రాకముందు కళా రంగంలో కృష్ణుడిగా,రాముడిగా ప్రజల మనస్సులను అలరించారని అలాంటి వ్యక్తి నిలువెత్తు విగ్రహం ఆదివారం తక్కెళ్ళపాడు గ్రామంలో ఆవిష్కరణకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కావడం తమకు గౌరవ ప్రదం అన్నారు. సమావేశంలో జాలాది బ్రహ్మయ్య,నందిపాటి ప్రసాద్,కూచిపూడి రాజేష్, వెంకటేశ్వరరావు, ఆలపాటి సంపత్ పాల్గొన్నారు.



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలం లో ఎరువుల కఅత్రిమ కొరత సఅష్టిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి సుగుణ బేగం అన్నారు. శనివారం మండలం లో ఎరువుల గూడెం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం లో 150 మెట్రిక్ టన్నుల యూరియా, 300 మెట్రిక్ టన్నుల డిఏపి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వంగిపురంలో గతంలో రైతులకు 300 కట్టలు యూరియా,100 డి. ఏ.పి రైతులకు ఈ క్రాప్ ఆధారంగా రైతు సేవ కేంద్రం ద్వారా రైతులకు రెండు యూరియా బస్తాలు ఒక డిఏపీ బస్తా ఇచ్చారు. అయితే ఎక్కువ మొత్తంలో వ్యవసాయం చేసే రైతులకు సరి పోవని అరకొర గానే ఇచ్చారని రైతులు తెలుపుతున్నారు. ప్రైవేటు దుకాణాలలో ఎక్కువ రేట్లకు అమ్ముతున్నా చర్యలు తీసుకోవడం లేదని రైతులు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపీ షేక్ జబీన్ అన్నారు. స్వచ్ఛందర స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మూడవ శనివారం జరగాల్సి ఈ కార్యక్రమం గత వారం కృష్ణాష్టమి కావడంతో నాలుగో వారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున ఈనెల మాన్ సూన్ హైజిన్ (వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండటానికి పాటించవలసిన పరిశుభ్రత) అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి శివాలయం సెంటర్ వద్దకు ర్యాలీ నిర్వహించి అక్కడ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి డాక్టర్ ఐ.ఇందిరా మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులు తీసుకోవలసిన జాగ్రత్తలు ముఖ్యంగా నీటి కాలుష్యం దోమలు ఊపిరితిత్తుల వ్యాధులు ఆహారపు అలవాట్ల లో మార్పులు వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవడానికి బలవర్ధకమైన శుభ్రమైన ఆహారం తీసుకోవటం, పరిసరాల పరిశుభ్రత పట్ల పాటించవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. సర్పంచ్ బాణావత్ ఖుషి బాయ్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న ప్రస్తుత తరుణంలో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు తొలుత ప్రకాశం పంతులు జన్మదినం సందర్భంగా ఎంపిడిఓ, పంచాయతీ కార్యాలయాలలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డి జవహర్‌లాల్ నెహ్రూ, ఏపీఎం సురేష్ కుమాం, గ్రామ కార్యదర్శి వివేకానంద తెలుగుదేశం పార్టీ నాయకులు గూడూరు వెంకట్రావు, వల్లూరి నరసింహారావు, పటాన్ జున్ను ఖాన్ కొంగర జోగేంద్ర పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఆర్థిక సాక్షరతే శక్తివంతమైన సమాజానికి మూలం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రతి కుంటుంబం ఆర్థిక సాక్షరత సాధిస్తేనే స్వయం అభివృద్ధి చెందుతుందని, పొదుపు అలవాట్లు పెంపొందించు కుని బ్యాంకింగ్ సౌకర్యాలను వినియోగించటం, రుణాల ద్వారా వ్యాపారాలను వృద్ధి చేసుకోవటం, భవిష్యత్ భద్రత కోసం బీమా పథకాలను ఎంచుకోవటం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని కెఎల్ యూనివర్శిటీ మేనేజ్మెంట్ అండ్ హ్యూమానిటీస్ డీన్ డాక్టర్ కిషోర్ బాబు సూచించారు. శనివారం ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో యూనివర్శిటీ ఎంబీఏ ఎన్ఎస్ఎస్ విభాగం, ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్, ఎస్బీఐ కెఎల్‌యు బ్రాంచి ఆధ్వర్యంలో స్వయం సహాయక, పొదుపు సంఘాలు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, చిరు వ్యాపారులు, గ్రామస్తులకు ఆర్థిక సాక్షరతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రమేష్ బాబు చెప్పారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, పొదుపు, రుణాలు, బీమా, డిజిటల్ బ్యాంకింగ్ ప్రాముఖ్యతపై ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ చైతన్య బైనీ వివరించారు. ప్రభుత్వ రాయితీలు, ఆర్థిక సేవలు, హక్కులు, పొదుపులు, క్రమంగా డిపాజిట్లు చేయటం, బ్యాంక్ ఖాతాలు ప్రారంభం, రైతులు, చిరు వ్యాపరుల కోసం రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ చైర్మన్ మేఘనారెడ్డి కొల్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబీఏ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వరకుమార్, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కెవివి.రాజు, గ్రామ పెద్దలు కత్తిక మల్లిఖార్జునరావు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జోజప్ప, ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, స్వయం, పొదుపు సంఘాల సభ్యులు, వ్యాపారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పొదుపు సంఘాలకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు


గ్రామాలను సుందరంగా తీర్చి దిద్దడమే లక్ష్యం : ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - తాడికొండ

పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చి దిద్ది గ్రామాలను అత్యంత సుందరంగా తీర్చి దిద్దడమే ధ్యేయమని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ గ్రామంలో స్వచ్ఛ-ఆంధ్ర స్వర్ణ-ఆంధ్ర, స్వచ్ఛ తాడికొండ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి మారు మూల ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామంలో పారిశుధ్య పనుల కోసం 10జేసీబీలు, 20ట్రాక్టర్లు, 200మంది పారిశుధ్య కార్మికులతో పనులు మొదలు పెట్టారు. శ్రావణ్ కుమార్ కంతేరు రహదారి పరిశీలించి గ్రామంలోని వీధుల్లో తిరిగారు. అనంతరం చెంచుకాలనీలో 30ఏళ్ల నుండి రోడ్డు మార్గాలు, డ్రెయినేజి వ్యవస్త లేకుండా అవస్థలు పడుతున్న కాలనీ వాసులకు పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మిస్తామని శ్రావణ్ కుమార్ హామీ ఇచ్చారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రధానంగా మురుగునీటి నిల్వ, దోమల వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ మెహర్ కుమార్, ఎంపీడీఓ సమతా వాణి, పంచాయతీ కార్యదర్శులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సంఘ నాయకులు

తెనాలిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - తెనాలి

తెనాలిని జిల్లాగా ప్రకటించాలని పట్టణం పరిసర ప్రాంత సంఘం డిమాండ్ చేసింది. స్థానిక కొత్తపేటలోని సంఘ కార్యాలయంలో సంఘం అధ్యక్షులు దర్శి శివ కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెనాలి జిల్లా కావడానికి గల అవకాశాలను చర్చించారు. జిల్లా కేంద్రానికి కావలసిన కార్యాలయాల ఏర్పాటుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని, తెనాలికి అత్యంత సమీపంగా ఉన్న వేమూరు ప్రాంత ప్రజలు కూడా బాపట్ల వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని వారు చర్చించారు. ఈ సందర్భంగా శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ విద్యాసంస్థల ఏర్పాటుకు, జిల్లా అధికారులకు కార్యాలయాలు కేటాయిం చేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రజా సంఘాలతో కలిసి తెనాలి జిల్లాగా ఏర్పాటు కావడానికి ఉద్యమం చేపట్టాలని, అలాగే మెసేజ్లు, ఉత్తరాల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి విషయం తీసుకెళ్ళేందుకు కార్యచరణ చేపట్టనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో అబ్దుల్ ఆరిఫ్, ఆర్ఎస్ శంకరరావు, ఎన్.కమల్ కుమార్, అబ్రహం లింకన్, ఈవూరి నవీన్ చంద్, పి.సతీష్, ఎల్.చిరంజీవి, రాజేష్, కె.వి.సత్యనారాయణ, ఫణీంద్ర పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

263వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావలసిన బకాయిల కోసం ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 263 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్, కార్మికులు షేక్ సుభాని, బి.అంకయ్య, ప్రారంభించారు. దీక్షలలో ఎం.డి.ఇస్మాయిల్, సిహెచ్. పిచ్చయ్య, షేక్ ఖాసీం, వేముకొండా, ఉప్పు కాసమ్మ కూర్చున్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి పైసా లేకుండా పరిష్కరించడానికి అవకాశం ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరైనది కాదని చెప్పారు. యాజమాన్యం, కార్మికులను కూర్చోబెట్టి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరావు, వై.సాంబశివరావు, షేక్ బాషా, బి.సూర్యప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.




తగ్గుముఖం పట్టిన వరద నీటి ప్రవాహం

కృష్ణానది వరద తగ్గుముఖం

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రకాశం బ్యారేజీ వద్ద శనివారం వరద తగు ముఖం పట్టింది. పైనుండి 3.92 లక్షల వరద నీరు బ్యారేజీ వద్దకు చేరుతుంది. అంతే స్థాయిలో నీటిని దిగువకు సముద్రంలోకి వదులుతున్నారు. వరద క్రమంగా తగ్గుముఖం పట్టడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉప సంహరించారు. వరద తగ్గి ముఖం పట్టిన నది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని కార్యాలయంలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మాచిరాజు రామకఅష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మాతంగి సత్యసాగర్, ఎల్.లక్ష్మీనారాయణ, జె.గరటయ్య, జి.సుబ్బారావు, బి.ప్రసాద్ సత్యనారాయణ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

గాజు గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌ను పురస్కరించుకుని మేరీ మాత హైస్కూల్ మాస్టర్ గల్లా శంకర్రావు గాజు గ్లాసులు శనివారం పంపిణీ చేశారు. హరిశ్చంద్ర పురం, వడ్డమాను తుళ్లూరులోని టీ దుకాణాల యజమానులకు గాజు గ్లాసులు అందజేశారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు జరిగే కృషిలో భాగస్వామిని కావాలనే సంకల్పంతో గతంలో కూడా గాజు గ్లాసులు పంపిణీ చేశానని శంకర్రావు మాస్టర్ తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

క్వాంటమ్‌వ్యాలీ హ్యాకాథాన్‌పై కళ్లం కాలేజీలో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం హరనాధరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన క్వాంటమ్ వ్యాలీ- 2025 హ్యాకాథాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు బూట్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి వారి హ్యాకాథాన్ పోటీలలో ప్రతి విద్యార్థి పాల్గొనాలని, ఈపోటీలు కళాశాల, రీజనల్, రాష్ట్రస్థాయిలో జరుగుతాయని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బిరెడ్డి, కళాశాల ఉపాధికల్పన అధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు, హ్యాకాథాన్ పోటీల నిర్వాహకురాలు డాక్టర్ బి.బిందుమాధవి పాల్గొన్నారు.

యువత ఆరోగ్యంపై అభ్యుదయ కాలేజీలో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న డాక్టర్ శనక్కాయల రాజకుమారి

అభ్యుదయ మహిళా జూనియర్ కాలేజిలో యువత వయసు్స-ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యం గురించి, సర్వైకల్ వ్యాక్సిన్ గురించి విద్యార్థులతో ప్రసంగించారు. మహిళలకు సంబంధించి రుతుక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు బిందు, వాణిలత, వాణిగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్

మిషన్‌గ్రీన్ గుంటూరులో భాగంగా దశల వారీగా చేపట్టిన 5 లక్షల మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా కీలకమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కావటి శంకర్రావు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటడం, విద్యార్థులతో మానవ హారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రతి నెల 3వ శనివారం జరిగేదని, ప్రస్తుతం 4వ శనివారం జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ ఇళ్లల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈ వారం వర్షాకాలం-పరిశుభ్రత నినాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించిందన్నారు. అనంతరం మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారం చేపట్టి, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతిపద్మజ, ఏడిహెచ్ శాంతి, స్కూల్ హెచ్‌ఎం సీతారాములు, పిఎంసి చైర్మన్ ముసలయ్య, మానవత సంస్థ సెక్రెటరి సతీష్, ప్రెసిడెంట్ శ్రీనివాస్, కన్వీనర్ సాంబశివరావు, ట్రెజరర్ సాయిరామ్ పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ టి.సంధ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా ఆగస్టు 23వ తేదీని భారతదేశం నేషనల్ స్పేస్ డేగా ప్రకటించిందన్నారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో పురుషులతో మహిళలు రాణిస్తున్నారని, యువత అంతరిక్ష పరిశోధనపై ఆసక్తి పెంచుకోవాలని, ఉన్నత దశకు చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థినులు అంతరిక్షంలో పరిశోధనలో సాధించిన విజయాలపై పోస్టర్ ప్రజంటేషన్, రాకెట్ లాంచింగ్ గురించి, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి సిహెచ్.రామారావు, అధ్యాపకులు, జి.శాంతకుమారి పాల్గొన్నారు.

మలినేని కాలేజీలో ముగిసిన 36 గంటల హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థులను అభినందిస్తున్న విజయ్‌కుమార్, తదితరులు

మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎఐ, ఐఒటి 36 గంటల హ్యాకథాన్ శనివారం ముగిసింది. ఈపోటీలో 28 జట్లు, మొత్తం 140 మంది విద్యార్థులు పాల్గొని, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ తదితర విభిన్న రంగాలలోని వాస్తవ సమస్యలకు 28 సజనాత్మక ఆలోచనల ద్వారా వినూత్న పరిష్కారాలను అందించారు. ఉత్తమంగా ఉన్న టాప్ 3 జట్లకు మొత్తం రూ.20వేలు నగదు బహుమతి అందచేశారు. ఈ కార్యక్రమం మొత్తం వ్యవధిలో మేక్‌స్కిల్డ్ బందం మెంటార్లుగా మార్గదర్శనం చేసింది. నిఫాటెక్ గ్లోబల్ ప్రైవేటు లిమిటెడ్ సిఇఒ పావన్ విజయ్‌కుమార్ మంథి మాట్లాడుతూ ఐఒటి, ఎఐ ప్రాధాన్యత గురించి వివరించారు. 'ప్రస్తుతం ప్రతి రంగంలోనూ- వ్యవసాయం నుండి పరిశ్రమల వరకు, వైద్యసేవల నుండి స్మార్ట్ సిటీల వరకూ ఎఐ, ఐఒటి సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయన్నారు. ఈ టెక్నాలజీలలో నైపుణ్యం సంపాదించడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు మార్గదర్శకులవుతారని అన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ 'కొత్త సాంకేతికతలపై పట్టు సాధించడం, ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించడం ప్లేస్‌మెంట్‌లో కీలకమని, ఇలాంటి హాకథాన్‌లు విద్యార్థుల్లో క్రియేటివిటీ, టీమ్‌వర్క్, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొంది స్తాయని చెప్పారు. కార్యక్ర మంలో డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వ రరావు, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ డి.విజయ సారధి తదితరులు పాల్గొన్నారు.

మలివిడత భూ సమీకరణపై ప్రతిష్టంభన

వీక్షణం

రాష్ట్ర రాజధాని అమరావతిలో రెండో విడత భూ సమీకరణ పథకం -2025కి ప్రభుత్వం గత నెల ఒకటో తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు స్థానికంగా జిల్లా అధికారులు గ్రామాల వారీగా ఎటువంటి నోటిఫికేషన్లు విడుదల చేయక పోవడంతో మలి విడత భూసమీకరణపై ప్రతిష్టంభన ఏర్పడింది. ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి 50 రోజులు దాటినా ఇంత వరకు అధికార వర్గాల్లో కదలికలేదు. గత మే, జూన్ నెలల్లో తుళ్లూరు, తాడికొండ, అమరావతి, పెదకూరపాడు మండలాల్లో గ్రామసభలు నిర్వహించి అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో చర్చించారు. ఎక్కువ మంది రైతులు మలి విడత భూ సమీకరణను వ్యతిరేకించారు. అయినా ప్రభుత్వం జూన్ 24న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో మలివిడత భూ సమీకరణకు ఆమోదం తెలిపింది. మంత్రి వర్గం నిర్ణయం మేరకు జులై ఒకటిన భూ సమీకరణకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు మునిసిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ జులై ఒకటిన ఉత్తర్వులు జారీ చేశారు. 2015లో రాజధాని అమరావతిలో ప్రారంభం అయిన భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చిన ప్యాకేజిని మలి విడతలో కూడా అమలు చేయనున్నారు. రాజధాని నిర్మాణంలో భాగంగా భూములు ఇచ్చే రైతులకు ఒనగూరు ప్రయోజనాలు వివరిస్తూ ఈ నోటికేషన్ విడుదల చేశారు. 2015లో మొదటి విడత భూములు అప్పగించిన రైతులకు అందించిన ప్యాకేజీని రెండో విడతలోకూడా కొనసాగిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు ఇచ్చి 50 రోజులు అయినా ఎటువంటి కదలిక లేదు. దీంతో మలి విడత భూ సమీకరణ ఉంటుందా ఉండదా అనే అంశంపై అస్పష్టత ఏర్పడింది. అయితే 2015లో రాజధాని గ్రామాల్లో ఉన్న భూముల ధరలకు 2025లో రాజధాని బయట గ్రామాల్లో భూముల ధరలకు భారీ వ్యత్యాసాలు ఉన్నాయని రైతులు వాదించారు. 2015లో రాజధానిలోని 29 గ్రామాల్లో భూముల ధరలు అతి తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు రాజధాని పరిసర గ్రామాలు, మండలాల్లో భారీగా ధరలు పెరిగాయని రైతులు వ్యాఖ్యానించారు.

అందువల్ల ప్యాకేజి పెంచితేనే భూములు ఇస్తామని రైతులు అధికారులు, తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేల వద్ద గ్రామ సభల్లోనే ప్రస్తావించారు. అంతేగాక మొదటి విడత భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటి వరకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వలేదని తమకు ఎప్పటికి దక్కుతాయోమోనన్న సందేహాన్ని మలి విడత భూ సమీకరణకు ఎంపిక చేసిన గ్రామాల రైతులు వ్యక్తం చేశారు. 2015లో రాజధాని గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో కూడా ఎకరం రూ.10 లక్షల నుంచి 30 లక్షలు ఉండగా ఇప్పుడు రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు పెరిగింది. దీంతో ప్రస్తుతం రాజధానికి భూములు ఇవ్వడానికి రైతులు వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వానికి భూమి ఇచ్చి ప్యాకేజి కింద ఇచ్చే 1250 గజాల స్థలం తీసుకోవడం కన్నా తాము ఎకరం అమ్ముకుంటే ఎక్కువ సొమ్ము వస్తుందనే భావన రైతుల్లో కన్పిస్తుంది. దీంతో రైతుల్లో రాజధానికి భూములు ఇచ్చేందుకు సుముఖత చూపడం లేదు. ప్రధానంగా గుంటూరు -అమరావతి, బండారుపల్లి వయా రావెల-తాడికొండ, తాడికొండ-తుళ్లూరు, అమరావతి-తుళ్లూరు తదితర మార్గాల్లో రోడ్డు పక్కన భూముల ధరలు బాగా పెరిగాయి. అంతేగాక ఎక్కువ గ్రామాల్లో రోడ్డుపక్కన ఇప్పటికే వెంచర్లు వేశారు. వీటికి గత పదేళ్లలో సిఆర్‌డిఏ అనుమతి ఇచ్చింది. కొన్ని అనధికారికంగా కొనసాగుతున్నాయి. వెంచర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ధరలు భారీగా పెంచడం వల్ల సాధారణ రైతులు కూడా తమ భూములకు కూడా అంతే ధర వస్తుందని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత, వామపక్షాలు, కాంగ్రెస్ మరో విడత సమీ కరణను వ్యతిరేకించాయి. అంతర్గతంగా జనసేన కూడా మలివిడత భూ సమీకరణను వ్యతిరేకించినట్లు ప్రచారం జరిగింది. దీంతో గత 50 రోజులు ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ఎటువంటి నోటిఫికేషన్లు జారీ కాలేదు. అయితే మరో సారి సమీకరణ ఉంటుందో లేదో స్పష్టత లేకపోవడంతో ఈ మూడు మండలాల్లో ప్రస్తుతం భూ లావాదేవీల్లో స్తబ్ధత ఏర్పడింది. క్రయ విక్రయాలు మందగించాయి. కొన్ని గ్రామాల్లో దాదాపుగా నిలిచిపోయాయి.

(ఎ.వి.డి.శర్మ)

రోడ్డు నిర్మాణానికి స్థలాలివ్వం

సిఆర్‌డిఎ అధికారులతో దొండపాడు రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు


దొండపాడులో సభలో అధికారులతో మాట్లాడుతున్న రైతు

ఇళ్లకు దగ్గరలో ఉన్న స్థలాలను రోడ్డు నిర్మాణం కోసం తీసుకొని ప్రత్యామ్నాయంగా ఊరికి దూరంగా స్థలాలు ఇస్తామంటే తాము అంగీకరించేది లేదని దొండపాడు గ్రామంలోని స్థల యజమానులు స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలోఎన్-15 రహదారి నిర్మాణం కారణంగా దొండపాడు గ్రామానికి చెందిన 10 మంది స్థలాలను కోల్పోనున్నారు. ఈ నేపథ్యంలో వారి నుంచి అభిప్రాయ సేకరణ కోసం శనివారం సిఆర్‌డిఎ అధికారులు పంచాయతీ కార్యాలయం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపాడు గ్రామస్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 'ప్రత్యామ్నాయ స్థలాలను గ్రామానికి సమీపంలో ఉన్న సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన ఇస్తే తప్ప స్థలాలను ఇవ్వడానికి అంగీకరించము అని చెప్పారు. మైనేని వెంకట్రామయ్య అనే రైతు మాట్లాడుతూ, తనకు కేటాయించిన రిటర్నబుల్ ఫ్లాట్లకు రోడ్డుపోటు ఉందని సిఆర్‌డిఎ అధికారుల దృష్టికి తీసుకువచ్చానని,రెండేళ్లుగా ప్లాట్లు మార్చాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా నేటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని సిఆర్ డిఎ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సభలో సిఆర్‌డిఎ అధికారులు శ్రీనివాస్ నాయక్, ఫణీంద్ర బాబు పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు పే స్కేలు వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు


సమావేశంలో పాల్గొన్న రాష్ట కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఇతర నాయకులు

గ్రామ రెవెన్యూ సహాయకులకు తెలంగాణ తరహా పేస్కేలు వేతనాలు అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత గుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో షేక్.ఆదాంషఫీ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాల నుండి గ్రామరెవెన్యూ సహాయకులకు వేతనాలు పెంచకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటు దన్నారు. తెలంగాణ తరహా పేస్కేల్ వేతనాలు అమలు జరపాలన్నారు. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని, వీఆర్‌ఏలకు ఆఫీసు, నైట్ డ్యూటీలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనకు వీఆర్ఏలు అంత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు బందగీ సాహెబ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వీఆర్ఏలకు వేతనాలు పెంచకపోగా రికవరీ చేశారని, ప్రతి ఒక్క వీఆర్ఏ దాదాపు రూ.15 వేలు నష్టపోయారన్నారు. ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, విఆర్ఓ పోస్టులు విఆర్‌ఎలతో భర్తీ చేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు పోరాడి ఇప్పటివరకు ఏవైనా సాధించుకున్నారని, రానున్నటువంటి కాలంలో పోరాడి వేతనాలు సాధించుకునేందుకు ఐక్యంగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాజీ బాబు, షేక్ నాగుల మీరా, నాయకులు సాంబశివరావు, రామారావు, బాబు, రవి కుమార్, చంద్రశేఖర్, కరిమునిషా, షఫీ, నాగేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.